Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 211 పేజీలు (Pages): 8 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

మంగళవారం, 31 - 3 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం: 2015


## ఇది మా మత్స్య సంపద...ఇతర రాష్ట్రాల జాలర్లు రావడం కరెక్ట్ కాదు



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఇతర రాష్ట్రాల జాలర్లు ఆంధ్రప్రదేశ్ జలాల్లోకి ప్రవేశించి చేపల వేట సాగించడం ఏమాత్రం సరికాదని, ఇక్కడి మత్స్యకారుల జీవితాలను దెబ్బతీసే ఈ చర్యలను ఉపేక్షించబోమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. స్థానిక మత్స్యకారుల ప్రయోజనాలకు ప్రభుత్వం పూర్తి అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. నేడు నాయుడుపేటలో ఇళ్ల పంపిణీ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో మాట్లాడిన సీఎం, పొరుగు రాష్ట్రాల జాలర్ల చొరబాట్లను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఈ విధానం వల్ల స్థానిక మత్స్యకారుల జీవనోపాధికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని, దీనిని అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు తక్షణ చర్యగా నెల్లూరు తీర ప్రాంత పరిరక్షణ కోసం రెండు ప్రత్యేక గస్తీ బోట్లను మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. అవసరమైతే మరో నాలుగు గస్తీ బోట్లను కూడా పంపించి తీరప్రాంత నిఘాను మరింత కట్టుదిట్టం చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక మత్స్యకారులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాల్సిన బాధ్యతను నెల్లూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. "మనకు సుదీర్ఘమైన తీర ప్రాంతం ఉంది. మన మత్స్య సంపద మన మత్స్యకారులకే చెందాలి. తమిళనాడు, పుదుచ్చేరి నుంచి వచ్చి మన జలాల్లో చేపలు పట్టుకోవడానికి వీల్లేదు. వారిని ఇక్కడికి రానివ్వకుండా కట్టడి చేస్తాం" అని చంద్రబాబు స్పష్టం చేశారు. గతంలో తీర ప్రాంత నిఘా కోసం తాము 20 బోట్లను ఏర్పాటు చేస్తే, వైసీపీ ప్రభుత్వం వాటిని గాలికి వదిలేసిందని, ఫలితంగా 12 బోట్లు నాశనమయ్యాయని ఆయన ఆరోపించారు. మత్స్యకారులకు అన్యాయం జరగకుండా చూడటం తన బాధ్యత అని పునరుద్ఘాటించారు. ఇదే సభలో మత్స్యకారుల సంక్షేమానికి తీసుకుంటున్న మరిన్ని చర్యలను కూడా సీఎం వివరించారు. చేపల వేట నిషేధ సమయంలో ఇచ్చే భృతిని "మత్స్యకార సేవ" పథకం ద్వారా రూ. 20 వేలకు పెంచినట్లు తెలిపారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 1.29 లక్షల కుటుంబాలకు రూ. 259 కోట్లను వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. మత్స్యకారులకు నష్టం కలిగించేలా గత ప్రభుత్వం తీసుకొచ్చిన 217 జీవోను కూడా రద్దు చేశామని గుర్తు చేశారు.

## సమాజ సేవలో "అర్జాస్ స్టీల్" ముందంజ

### - జిల్లా స్థాయిలో 'పి4' అవార్డు అందుకున్న అర్జాస్ స్టీల్ పరిశ్రమ





**అనంతపురం, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పి4 (పబ్లిక్-ప్రైవేట్-పీపుల్ పార్ట్నర్‌షిప్) పథకం కింద జిల్లా స్థాయిలో నిర్వహించిన అవార్డుల్లో అర్జాస్ స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్ రెండో స్థాయి పి4 అవార్డును అందుకుంది. అనంతపురం జిల్లాలోని జె ఎన్ టీ యూ ఆడిటోరియంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ చేతుల మీదుగా ఈ అవార్డును ప్రదానం చేశారు ఈ సందర్భంగా అర్జాస్ స్టీల్ తరపున ఎక్స్‌టర్నల్ రిలేషన్స్ & సీఎస్ఆర్ విభాగాధిపతి నరేందర్ మిసా అవార్డును స్వీకరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించిన పి4 పథకం ఏడాది క్రితం అమల్లోకి వచ్చింది. ఈ పథకం ద్వారా ప్రభుత్వంతో పాటు పరిశ్రమలు, సంస్థలు, ప్రజలు కలిసి సామాజిక అభివృద్ధికి తోడ్పడాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. విద్య, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, నైపుణ్యాభివృద్ధి, సమాజ సంక్షేమం వంటి కీలక రంగాల్లో ఈ పథకం ప్రధానంగా దృష్టి సారిస్తోంది. ఈ పథకం కింద అర్జాస్ స్టీల్‌ను "మెంటర్"గా కూడా గుర్తించారు. సమాజ అభివృద్ధి కార్యక్రమాలకు మార్గదర్శకంగా నిలుస్తూ అర్జాస్ సంస్థ అందిస్తున్న సహకారానికి ఈ గుర్తింపు లభించింది. ఈ అవార్డు తమ సంస్థ సామాజిక బాధ్యత, సుస్థిర అభివృద్ధి పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని అర్జాస్ స్టీల్ ప్రతినిధి నరేందర్ మిసా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా పరిపాలనకు కృతజ్ఞతలు తెలుపుతూ భవిష్యత్తులో కూడా ఇదే దిశగా సేవలు కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు.

## లోక్‌సభ వేదికగా మావోయిస్టులకు అమిత్ షా వార్నింగ్



**ఢిల్లీ :** నక్సలిజం నిర్మూలనపై లోక్‌సభలో చర్చ మట్నదలైంది. మావోయిస్టులపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్టేట్‌మెంట్ ఇచ్చారు. మావోయిస్టుల ఏరివేతకు రేపే (మార్చి 31) డెడ్ లైన్ అని తెలిపారు. బస్తర్‌లో ప్రస్తుతం మావోలు లేరని.. మావోయిస్టు రహిత ప్రాంతంగా మారిందని వెల్లడించారు. బస్తర్‌లో ఆదివాసీలకు ప్రస్తుతం అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. అభివృద్ధి దిశగా బస్తర్ ప్రాంతం ముందుకెళ్తోందని తెలిపారు. మావోల లొంగుబాటుకు రేపే (మంగళవారం) ఆఖరి తేదీ అని.. అభివృద్ధి లేదంటూ ఆయుధాలు పట్టుకోవడం సరికాదని హితవుపలికారు అమిత్ షా. ఆయుధాలు వీడని వారి అంతు చూస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. కాంగ్రెస్ హయాంలో విలీన ప్రాంతాలను నిర్లక్ష్యం చేశారని.. కాంగ్రెస్ పాలనలోనే గిరిజన ప్రాంతాలు ఎందుకు అభివృద్ధి చెందలేదని ప్రశ్నించారు. వారి పాలనలో బస్తర్ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదని.. గిరిజనులను 60 ఏళ్లపాటు కాంగ్రెస్ విస్మరించిందని మండిపడ్డారు. కాంగ్రెస్ నిర్వాకం వల్లే దేశంలో మావోయిజం పెరిగిందని కేంద్ర హోంమంత్రి ఆరోపించారు. మావోయిజం వల్ల 12 రాష్ట్రాల్లో అభివృద్ధి కుంటుపడిందని అమిత్ షా ధ్వజమెత్తారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని.. తమ వల్లే నక్సల్స్ విముక్త భారత్ సాధ్యమవుతోందని లోక్‌సభ వేదికగా కేంద్ర మంత్రి ప్రకటించారు.

## సేవా స్వర్ణనంది నేషనల్ పురస్కారం అందుకున్న వి.వి.సాంబశివరావు





**విజయవాడ, (రాజధాని వార్తలు):** ఉగాది ఉత్సవాల సందర్భంగా లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320ఏ ఆధ్వర్యంలో పరాభవ నామ సంవత్సర ఉగాది సేవా స్వర్ణనంది నేషనల్ లెవెల్ పురస్కారం విజయవాడకు చెందిన వి.వి.సాంబశివరావు అందుకున్నారు. ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఎన్జీవో ప్రోగ్రాం మేనేజర్‌గా పనిచేస్తున్న సాంబశివరావు చేస్తున్న సామాజిక సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు ఆయనకు లభించింది. ఆదివారం సికింద్రాబాద్‌లోని లయన్స్ భవన్ నందు నిర్వహించిన కార్యక్రమంలో అవార్డుతో సత్కరించడం జరిగింది. సాంబశివరావు ప్రోగ్రామ్ మేనేజర్‌గా అనేక సేవా కార్యక్రమాలు, బ్లడ్ డొనేషన్, ఐ క్యాంపులు, సి పి ఆర్ ట్రైనింగ్ ప్రోగ్రాములు అనేకం నిర్వహించి పలు బహుమతులు అందుకోవడం జరిగింది. కలెక్టర్ అవార్డు, డిస్ట్రిక్ట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ల అవార్డు, డాక్టర్.సమరం, రాష్ట్ర హెల్త్ మినిస్టర్ చే అవార్డు , హైదరాబాద్ నందు ఆల్ ది బెస్ట్ లయన్ అకాడమీ వారిచే ఉగాది పురస్కారం తీసుకోవటము జరిగినది.

కాగా ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ లయన్ డాక్టర్ జి.మహేంద్ర కుమార్ రెడ్డి, సురేష్ జగ్నాని, యాదయ్య గౌడ్, శశికాంత్, లయన్స్ మెంబర్లు సాంబశివరావును సత్కరించి, మెమోంటో, స్వర్ణ నందిని బహుకరించారు.

## లాకర్లలోని వస్తువులను బ్యాంకులు చూడవు, రికార్డు చేయవు



**న్యూఢిల్లీ:** వినియోగదారులు లాకర్లలో ఉంచే విలువైన వస్తువులను బ్యాంకులు చూడలేవని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. వాటిని చూడటం లేదా రికార్డు చేయడం బ్యాంకింగ్ నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని అన్నారు. బ్యాంకు లాకర్లలో భద్రపరిచిన విలువైన వస్తువుల బీమా కవరేజీ అంశంపై ఆమె మాట్లాడారు. వస్తువుల ఆధారంగా బీమా కవరేజీ ఉంటుందనే వాదనను ఆమె తోసిపుచ్చారు. ఆర్బీఐ నిబంధనల ప్రకారం దొంగతనం, అగ్నిప్రమాదం, బ్యాంకుల్లో మోసాలు వంటి సందర్భాల్లో నష్టం వాటిల్లితే పరిహారం అందిస్తాయని అన్నారు. లాకర్ వార్షిక అద్దెకు 100 రెట్లు పరిహారాన్ని బ్యాంకులు చెల్లిస్తున్నట్లు తెలిపారు. కానీ లాకర్లలోని వస్తువులను బ్యాంకులు తనిఖీ చేయలేవు కాబట్టి విలువ ఆధారంగా పరిహారం చెల్లించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ప్రస్తుతానికి బీమా కవరేజీకి సంబంధించి కొత్త ప్రతిపాదనలేవీ పరిశీలనలో లేవని స్పష్టం చేశారు.

## అన్నదాతలను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవు: మంత్రి



**(నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లాలో ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యటన విజయవంతంగా సాగుతోంది. కోవూరు మండలం ఇనమడుగులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన మంత్రి.. అనంతరం గూడూరు మండలం పేడూరు గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పేడూరు ధాన్యం కొనుగోలు కేంద్రం పరిధిలోని వ్యవసాయ రైతుల సదస్సుకు మంత్రి నాదెండ్ల, ఎమ్మెల్యే సోమిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి పలు అంశాలపై వారికి భరోసా కల్పించారు. కూటమి ప్రభుత్వం అన్నదాతలకు ఎప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రభుత్వం దృష్టికి తేవాలన్నారు మంత్రి నాదెండ్ల మనోహర్. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అన్నదాతలు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇస్తున్నామని ఆయన చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేయలేదని అన్నారు. కూటమి ప్రభుత్వంలో కేంద్రాలను రైతులకు అనుకూలంగా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. అన్నదాతలు, ప్రభుత్వానికి రైస్ మిల్లర్లు వారధి వంటివారని.. రైతును దోపిడీ చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. తూకాల్లో ఎక్కువ ధాన్యం తీసుకుంటున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని.. అన్నదాతలను దోపిడి చేస్తే కఠిన చర్యలు ఉంటాయని మంత్రి నాదెండ్ల చెప్పారు. న్యాయబద్ధంగా పారదర్శకంగా రైతుకు గిట్టుబాటు ధర వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. సమస్యలు ఉంటే వాట్సాప్‌లో మెసేజ్ పెట్టాలని, అధికారులకూ చెప్పాలని రైతన్నలకు మంత్రి సూచించారు. సమస్యలను బాధ్యతగా తీసుకుని తొలగిస్తామని.. మీ సమస్యలు తెలుసుకునేందుకు ఇక్కడికి వచ్చినట్లు మంత్రి చెప్పుకొచ్చారు. జాతీయ ఉపాధి పథకం కింద గ్రామాల్లో ధాన్యం కల్లాలు ఏర్పాటు చేస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చారు.

## అమరావతిని రాజధానిగా ఒప్పుకుంటున్నారా? వైసీపీకి హోంమంత్రి సూటి ప్రశ్న



**విజయనగరం, (రాజధాని వార్తలు):** ఏపీలో లా అండ్ ఆర్డర్ విషయంలో పటిష్ఠంగా పని చేస్తున్నామని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ఈవ్‌టీజింగ్ జరగకుండా శక్తి టీమ్స్ పనిచేస్తున్నాయని తెలిపారు. సోమవారం హోంమంత్రి మీడియాతో మాట్లాడుతూ..మూలపేట పోర్టు 70 శాతం పూర్తి చేసింది కూటమి ప్రభుత్వమే అని అన్నారు. ప్రతీ విషయంలో 'క్రెడిట్' చోరీ చేయాలని వైసీపీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. 'మాది పని చేస్తున్న ప్రభుత్వం.. వాటాలు అడగని ప్రభుత్వం' అని తేల్చి చెప్పారు. గతంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో చాలా ప్రాజెక్టులను ఎత్తేసిన పరిస్థితి ఏర్పడిందని అనిత విమర్శించారు. వైసీపీ వాళ్లు వాటాలు, భాగస్వామ్యం అడిగారు కాబట్టే చాలా ప్రాజెక్టులు వెనక్కి వెళ్లిపోయాయన్నారు. రాజధాని అమరావతిపై మండలిలో కూడా తీర్మానం చేయాలని వైసీపీ నేతలు చెబుతున్నారని.. ఇంతకీ వారు రాజధానిగా అమరావతిని ఒప్పుకుంటున్నారా? లేదా? సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒకవేళ స్వాగతిస్తే ఎందుకు అసెంబ్లీకి రావట్లేదని నిలదీశారు. 'ప్రాజెక్టుల కోసం ఏ రైతు కూడా కన్నీరు కారుస్తూ భూమి ఇవ్వకూడదు. అది మా పాలసీ' అని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అహర్నిశలు కష్టపడుతున్నారని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.

# తమిళ జాలర్ల అక్రమ ప్రవేశాన్ని అరికట్టేందుకు నూతన హైస్పీడ్ బోటును వెంటనే కొనుగోలు చేయండి

**- మత్స్యశాఖ అధికారులకు సూచించిన జిల్లా కలెక్టర్ హిమాన్ష్ శుక్ల**
**- తక్షణమే నిధులు మంజూరు - మరో బోటును అద్దెకు ఏర్పాటు చేయాలని సూచన - నూతన బోటును మత్స్యకారులకే కేటాయించాలని ఆదేశం**





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పరిధిలో మత్స్యకారుల భద్రత మరింత బలోపేతం చేయడానికి, తమిళ జాలర్ల ఆగడాలను అరికట్టేందుకు సముద్ర తీరంలో గస్తీని ముమ్మరం చేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్ష్ శుక్లఆదేశించారు. ఈ నేపథ్యంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన 450 హెచ్‌పి సామర్థ్యం గల హైస్పీడు బోటునుతక్షణమే కొనుగోలు చేయాలని మత్స్యశాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు. శనివారం ఉదయం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో మత్స్యశాఖ అధికారులు, తీర ప్రాంతంలోని 9 మండలాల తహశీల్దార్లతో కలెక్టర్, సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మత్స్యకారుల భద్రతకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని తెలిపారు. ప్రస్తుతం రెండు బోట్లు సముద్రంలో గస్తీ నిర్వహిస్తున్నాయని, వీటిని హై స్పీడ్ బోట్స్‌గా అప్ గ్రేడ్ చేస్తామన్నారు. వీటికి అదనంగా రూ.1.20 నుండి రూ.1.50 కోట్ల అంచనా వ్యయంతో 450 హెచ్‌పి హైస్పీడ్ గల మరొక బోటు కొనుగోలు చేయాలని, అవసరమైన నిధులను తక్షణమే మంజూరు చేస్తామని తెలిపారు. బోటులో వీడియో రికార్డింగ్ సదుపాయం కలిగిన రెండు బైనాక్యులర్లు, అధిక సామర్థ్యం గల తాడులు (రోప్స్), ఫైర్ ఎక్స్టింగ్విషర్లు, రెండు ఫ్లాష్ లైట్లు, రెండు మెడికల్ కిట్లు వంటి అవసరమైన అన్ని భద్రతా పరికరాలను వెంటనే కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఖర్చు ఎంతైనా సరే అధునాతన సాంకేతికతతో కూడిన బోటును కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. నూతనంగా కొనుగోలు చేసే బోటును మత్స్యకారులకే కేటాయించి, దాని నిర్వహణ, ఆపరేషన్లను వారే చూసుకునేలా చేయాలని సూచించారు. ఈ హైస్పీడ్ బోటు ద్వారా సముద్రంలో వేగవంతమైన గస్తీ నిర్వహించడంతో తమిళనాడు జాలర్ల అక్రమ ప్రవేశాన్ని సమర్థవంతంగా అరికట్టవచ్చని పేర్కొన్నారు. దూరం నుంచే వారి కదలికలను బైనాక్యులర్ల ద్వారా గుర్తించి, వీడియో రికార్డింగ్ చేయడం కూడా సాధ్యమవుతుందని తెలిపారు. ఈ బోటు మత్స్యకారుల భద్రతతో పాటు వారి జీవనోపాధికి కూడా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కొత్త హై స్పీడ్ బోట్ వచ్చేవరకు ఒక హై స్పీడ్ బోట్‌ను అద్దెకు రెండు రోజులలోపు జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో అందుబాటులోకి తీసుకు రావాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో ఫిషరీస్ జాయింట్ డైరెక్టర్ డా. శాంతి నెల్లూరు, అసిస్టెంట్ డైరెక్టర్ చాంద్ బాషా, తీరప్రాంత మండలాల తహశీల్దార్లు అల్లూరు, కావలి, ఇందుకూరుపేట, టీపీ గూడూరు, ముత్తుకూరు విడవలూరు తహసీల్దార్, చంద్రశేఖర్, మత్స్య శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి వేములపాటి అజయ్ రూ. 50,000లు తక్షణ సహాయం





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** మార్కాపురం బస్ అగ్ని ప్రమాదంలో ఆత్మ కూరు చిన్నయ్య ప్రాణాలు కోల్పోవటం హృదయ విదారకం. రోజువారీ కూలి పనులతో కుటుంబాన్ని పోషిస్తున్న ఒక పేద కుటుంబానికి ఇది తీరని లోటు. ఈ విషాద సమయంలో "మేమున్నాం" అని చెప్పటమే కాకుండా తక్షణ సహాయం అందించమని జనసేనా జిల్లా పర్యవేక్షకులు వేములపాటి అజయ్ ఇక్కడకు పంపినట్లు జనసేన ప్రధాన కార్యదర్శి గునుకులు కిషోర్ అన్నారు. మార్కాపురం బస్సు అగ్ని ప్రమాద సంఘటనలో ప్రాణాలు కోల్పోయిన ఉదయగిరి, కలిగిరి మండలం, నాగ సముద్రం పంచాయితీ, బొమ్మలాయ్ చెరువు గ్రామం జనసేన మద్దతుదారులు ఆత్మకూరు చిన్నయ్య కుటుంబాన్ని జనసేన నాయకులు ఈరోజు పరామర్శించారు. ఈ విషాద సమయంలో వారి కుటుంబానికి మేమంతా అండగా ఉన్నామని తెలియజేయడానికి జనసేన జిల్లా నాయకులు గ్రామానికి విచ్చేసి, కుటుంబ సభ్యులను పరామర్శించి జిల్లా పర్యవేక్షకులు, ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ ఉదయగిరి నియోజకవర్గ నాయకులు కాశి ఆధ్వర్యంలో మరణించిన ఉద్యమి కుటుంబానికి రూ.50,000 ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఏ చిన్న కార్యకర్తకు ఇబ్బంది వచ్చినా మనమంతా తోడు ఉండాలని అజయ్ ఎప్పుడూ చెబుతుంటారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని సహకారాలతో పాటు భవిష్యత్తులో వారి కుటుంబానికి జనసేన పార్టీ చిన్నయ్య కుటుంబానికి అండగా నిలబడుతుంది. వారి పిల్లల భవిష్యత్తు, కుటుంబ అవసరాలకు అన్ని విధాల జనసేన సహాయం అందిస్తుంది. చిన్నయ్య పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, వారి కుటుంబానికి మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం అని తెలుపారు. జనసేన పార్టీ ఎప్పుడూ తన కార్యకర్తలను కుటుంబ సభ్యుల్లా భావిస్తుందని, కష్టకాలంలో వారి వెంట నిలబడటం మా బాధ్యతగా భావిస్తున్నామని ఈ సందర్భంగా తెలియజేశారు. వేములపాటి అజయ్ సూచనలతో ఐదుగురు ఆడబిడ్డల గల కుటుంబానికి పెద్ద దిక్కైన వారి తల్లికి ఏదైనా ఉపాధి అవకాశం కూడా కల్పించే విధంగా ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ సురేష్‌ని సంప్రదిస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ గునుకుల, జిల్లా కార్యాలయం ఇన్చార్జ్ జమీర్, సీనియర్ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, పప్పునారాయణ, షాజహన్, కావలి నాయకులు వెంకటసుబ్బయ్య, జానీ, జిల్లా సంయుక్త కార్యదర్శి మడపర్తి ప్రశాంత్ గౌడ్, నెల్లూరు నగర కార్యదర్శి జొన్నలగడ్డ హేమచంద్ర యాదవ్, కలిగిరి బండారు లక్ష్మీనారాయణ, వింజమూరు సత్యనారాయణ, నరేష్, గువ్వల వెంకీ, సురేషు, కాకుటూరు రాఘవేంద్ర, తిప్పినేని రమేష్, తెలపోలు రమేష్, గుండాబత్తిన రామ్మూర్తి, మల్యాద్రి రెడ్డి, మదన్ కుమార్ యాదవ్, దుత్తలూరు నాయకులు మహేష్, ఆత్మకూరు అక్బర్, బాషా, శ్రీనివాసులు, దుంపర్లపాడు భాను, షమ్మీ, ముద్రకొలను శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# శీతాలమ్మ గుడి వద్ద చలివేంద్రం ఏర్పాటు

**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తి పట్టణంలోని కొత్తపేట శీతాలమ్మ గుడి వద్ద బియన్ కండ్రిగ సర్కిల్ ఇన్స్పెక్టర్ తిమ్మయ్య చేతులమీదుగా చలివేంద్రం ప్రారంభించారు. శ్రీకాళహస్తి పట్టణంలో కొత్తపేట శీతాలమ్మ భక్త బృందం వారి ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించి పుచ్చకాయలను పంచి పెట్టారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ తిమ్మయ్య మాట్లాడుతూ ఎండాకాలం ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండటం వలన ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, పట్టణంలో చలివేంద్రాలు ఎక్కువగా ప్రారంభించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో భక్తి బృందం సీతాలమ్మ గుడి ప్రెసిడెంట్ పాలమంగళం రవి, ఆర్గనైజర్ అత్తింజేరి నాద ముని, అశోక్, ప్రకాష్ కత్తి రవి, పోలీస్ హేమంత్, సాయన్న చంద్రారెడ్డి, హరి, వెంకటసుబ్బయ్య, మహేష్ రావు, వెంకటాద్రి




నాయుడు, పోలీస్ బాల గురవయ్య, మునిశేఖర్ పాల్గొన్నారు.

# కొండూరు కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి





**కోవూరు /ఇందుకూరుపేట, (రాజధాని వార్తలు):** ఇందుకూరు పేట మం డలం, గంగపట్నం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీని యర్ నాయకులు కొండూరు సుధాకర్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో శనివారం మాజీ మంత్రి రాష్ట్ర పి ఏ సి సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డికొండూరు సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు అనంతరంస్వర్గీయ సుధాకర్ రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పినారు. మరియు వారితోపాటు వైసీపీ నాయకులు మవులూరు శ్రీనివాసులురెడ్డి గొల్లపల్లి విజయకుమార్, బట్టేపాటి నరేంద్ర రెడ్డి, కొండూరు కృష్ణారెడ్డి, చిరమణ గోపాల్ రెడ్డి, పంబాల జనార్దన్ రెడ్డి, దండిగుంట ఫణి నాయుడు సిగినం సుబ్రమణ్యం శరత్ తదితరులు ఉన్నారు.

# పిల్లల్లో గేమింగ్ వ్యసనాలను తగ్గించేందుకు కేంద్రం తీసుకుంటున్న చర్యలేంటి?

**- లోక్‌సభలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నలు**



**ఢిల్లీ:** దేశంలో పిల్లలపై, ముఖ్యంగా 13 ఏళ్లలోపు వారిపై ఆన్‌లైన్ గేమింగ్ ప్రభావం గురించి ప్రభుత్వం ఏదైనా సర్వే చేపట్టిందా అని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి లోక్‌సభలో ప్రశ్నించారు. పిల్లలలో గేమింగ్ వ్యసన సమస్యలను పరిష్కరించడానికి తీసుకున్న చర్యలు, గేమింగ్ వ్యసన విముక్తి కేంద్రాలను ఏర్పాటు చేయడాన్ని ప్రభుత్వం పరిగణించిందా అని ఆరా తీశారు. గత ఐదేళ్లలో దేశంలో ఏర్పాటు చేసిన కేంద్రాల జాబితా, నిధుల వివరాలు కోరారు. పిల్లలలో ఆన్‌లైన్ గేమింగ్ ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాల వివరాలు తెలియజేయాలన్నారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నలకు కేంద్ర మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ సమాధానం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు వినియోగదారులకు బహిరంగ, సురక్షితమైన, విశ్వసనీయమైన, జవాబుదారీగా ఉండే ఇంటర్నెట్ సేవలు అందించడమే లక్ష్యంగా ఉంటాయన్నారు. ఆన్‌లైన్ గేమ్‌లలో వ్యసనం వంటి వివిధ సామాజిక-ఆర్థిక సమస్యలను పరిష్కరించడానికి, కేంద్ర ప్రభుత్వం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఇంటర్మీడియరీ గైడ్‌లైన్స్ అండ్ డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్) రూల్స్, 2021 ("ఐటీ రూల్స్, 2021")ను నోటిఫై చేసిందన్నారు. ఐటీ రూల్స్, 2021, సోషల్ మీడియా మధ్యవర్తిత్వాలపై తగిన శ్రద్ధ వహించాల్సిన బాధ్యతలను తెలియజేస్తాయని చెప్పారు. సోషల్ మీడియా ప్లాట్ఫార్మ్‌లో ప్రసారం చేయకూడని సమాచారానికి సంబంధించి మధ్యవర్తులు ప్రస్తుతం అమలులో ఉన్న ఏదైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే ఐటీ నియమాలు, 2021 కింద చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రభుత్వం 1 అక్టోబర్, 2023 నుండి ఆన్‌లైన్ గేమింగ్‌పై 28% చొప్పున జీఎస్‌టిని ప్రవేశపెట్టిందని, ఆన్‌లైన్ మనీ గేమింగ్ సరఫరాదారు IGST యాక్ట్ - 2017లో పేర్కొన్న సరళీకృత రిజిస్ట్రేషన్ పథకం కింద ఒకే రిజిస్ట్రేషన్‌ను పొందాలన్నారు. ఆఫ్‌షోర్ ఆన్‌లైన్ మనీ గేమింగ్ సరఫరాదారులను కూడా ఐజీఎస్టీ చట్టం కింద నియంత్రిస్తున్నారని చెప్పారు. అంతేకాకుండా, ఐటీ చట్టంలో దేశ సమగ్రత, రక్షణ, రాష్ట్ర భద్రత, విదేశీ స్నేహ సంబంధాలు, శాంతి భద్రతల ప్రయోజనాల దృష్ట్యా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నియమాలు, 2009లో నిర్దేశించిన ప్రక్రియను అనుసరించి తగిన ఉత్తర్వులు జారీ చేసే నిబంధనలు ఉన్నాయన్నారు. దాంతోపాటు ఎలక్ట్రానిక్స్ & ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ 2022-25 సంవత్సరాల మధ్య (ఫిబ్రవరి, 2025 వరకు) ఆన్‌లైన్ బెట్టింగ్/జూదం/గేమింగ్ వెబ్‌సైట్‌లకు (మొబైల్ అప్లికేషన్‌లతో సహా) సంబంధించి బ్లాక్ చేసేందుకు 1410 ఆదేశాలను జారీ చేసిందన్నారు. ఆన్‌లైన్ గేమింగ్‌తో సహా పందెం, జూదానికి సంబంధించిన విషయాలపై చట్టాలు చేసే అధికారం రాష్ట్ర శాసనసభలకు ఉందన్నారు. సమాచార మరియు ప్రసార మంత్రిత్వ శాఖ 'ఆన్‌లైన్ గేమ్‌లు, ఫాంటసీ స్పోర్ట్స్ మొదలైన వాటి ప్రకటనలపై" అన్ని ప్రైవేట్ శాటిలైట్ టెలివిజన్ ఛానెళ్లకు కేంద్ర మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ప్రసారకర్తలందరికీ సూచించిందన్నారు. ఈ మార్గదర్శకాల ప్రకారం, ఏ గేమింగ్ ప్రకటనలోనూ 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సున్న వ్యక్తి ఆన్‌లైన్ గేమింగ్ ఆడుతున్నట్లు చిత్రీకరించకూడదనీ పేర్కొన్నారు. గేమ్‌లో ఆర్థికపరమైన నష్టభయం ఉందని మరియు ఇది వ్యసనానికి దారితీయవచ్చని సూచిస్తూ, ASCI కోడ్‌కు అనుగుణంగా ముద్రిత/స్టాటిక్ మీడియాలోనూ అలాగే ఆడియో/వీడియో రూపాల్లోనూ డిస్క్లెయిమర్ తప్పనిసరిగా ఉండాలి. అంతేకాకుండా ఆన్‌లైన్ గేమింగ్ వల్ల కలిగే ప్రతికూలతలను అధిగమించడంపై విద్యా మంత్రిత్వ శాఖ 2021 సెప్టెంబర్ 27న తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల కోసం ఒక సలహా పత్రాన్ని జారీ చేసింది. తదనంతరం, పిల్లల సురక్షిత ఆన్‌లైన్ గేమింగ్‌పై విద్యా మంత్రిత్వ శాఖ 2021 డిసెంబర్ 10న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మరో సలహా పత్రాన్ని జారీ చేసింది. ఆన్‌లైన్ గేమ్‌లు ఆడటం తీవ్రమైన గేమింగ్ వ్యసనానికి దారి తీస్తుందని, దీనిని గేమింగ్ డిజార్డర్‌గా పరిగణిస్తున్నారని ఆ సలహా పత్రం సూచించింది. అన్ని రకాల సైబర్ నేరాలను ప్రజలు నివేదించేందుకు వీలుగా ఎంహెచ్‌ఏ జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌ను కూడా ప్రారంభించింది. ఈ పోర్టల్‌లో పేర్కొన్న సైబర్ నేర సంఘటనలు, చట్ట నిబంధనల ప్రకారం తదుపరి చర్యల కోసం సంబంధిత రాష్ట్ర/కేంద్రపాలిత ప్రాంత చట్ట అమలు సంస్థకు పంపబడతాయనీ, ఆర్థిక మోసాలకు సంబంధించిన ఫిర్యాదులను నమోదు చేయడానికి ఈ పోర్టల్‌లో ప్రత్యేక యంత్రాంగాలు ఉన్నాయన్నారు. ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు నమోదు చేయడంలో సహాయం పొందడానికి '1930' అనే టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్‌ను కూడా అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు.


# గ్రామాల సమగ్రాభివృద్ధికి "స్వచ్ఛంద్ర - స్వర్ణాంధ్ర" - జి.రాగంపేటలో జేసి పర్యటన


**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** గ్రామాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వ యంత్రాంగం స్వచంద్ర - స్వర్ణాంద్ర పేరిట పనిచేస్తుందని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అన్నారు. విజన్ 2047లో భాగంగా ప్రతినెలా 3వ శనివారం నిర్వహించే "స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా పెద్దాపురం మండలం జి. రాగంపేట గ్రామంలో జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ శనివారం పర్యటించారు. గ్రామాల సమాగ్రా భివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వ యంత్రాంగం పనిచేస్తుందని జేసీ పేర్కొన్నారు. పెద్దాపురం మండలం జి.రాగంపేట గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. అంగన్వాడీ కేంద్రాలు, హెల్త్ సబ్ సెంటర్, పాఠశాలలను ఆయన పరిశీలించారు. ప్రభుత్వం పరంగా అందుతున్న సేవలపై ఆరా తీశారు. సదుపాయాలపై సిబ్బంది నుండి వివరాలను రాబట్టారు. ఇంకా ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు.

అలాగే చెత్త నుండి సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో లక్ష్మణ్ రావు, ఎంపీడీఓ కెవి సూర్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీఓ శేఖర్ రెడ్డి, శ్రీహరి, సూర్యనా రాయణ రెడ్డి, గ్రామ సర్పంచ్ బుంగాశేఖర్ బాబు, అడ్డూరి భాస్కరరావు, దూసర్లపూడి ఏసుబాబు, అడపా వెంకటేశ్వరరావు, జలదాన్ని సుబ్రహ్మణ్యంతో పాటు డ్వాక్రా సంఘాల సభ్యులు, ఆశా వర్కర్స్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

# ప్రతిభ కనబర్చిన కోవూరు శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులకు అభినందనలు

## - టీడీపి నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి







**కోవూరు, (రాజధాని వార్తలు):** ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలిం పియాడ్ టాలెంట్ టెస్టులో ప్రతిభ సాధించిన వారికి నెల్లూరు టీడీపి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి అభినందనలు తెలిపారు. అదేవిదంగా తీర్చిదిద్దీన కళాశాల యాజమాన్యంకు కూడా ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. 242 మందిలో 195 మంది మెడల్స్ బహుమతులు సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేసారు. దేశ స్థాయిలో ఏ పరీక్షలు జరిగినా అందులో తెలుగు విద్యార్థులు ముందంజలో ఉంటున్నారు.విద్యా రంగంలో ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా మన విద్యార్థులు సన్నద్ధం కావాలని సూచించారు ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడలో ప్రతిభ కనబర్చిన కోవూరు శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు కు కోవూరు శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర రెడ్డి విద్యార్థులకు మెడల్స్‌ను, బహుమతులను అందించారు. ఈ సందర్భంగా చేజర్ల వేంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ ఆధ్వర్యంలో జరిగిన టాలెంట్ టెస్టులో కోవూరు శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు 242 మంది పాల్గొని అందులో 195 మంది మెడల్స్, బహుమతులు పొందటం సంతోషం. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులు అందరికీ అభినందనలు తెలిపారు. దేశ స్థాయిలో ఏ పరీక్షలు జరిగినా అందులో తెలుగు విద్యార్థులు ముందంజలో ఉంటున్నారు. ఇది శుభపరిణామమని అన్నారు. మన విద్యార్థులు ప్రతిభతో ప్రపంచంలోని అన్ని దేశాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్నారు అంటే అందుకు కారణం విద్యలో రాణించడమే ప్రధాన లక్ష్యం అని అన్నారు. కావున ప్రపంచ వ్యాప్తంగా విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా మన విద్యార్థులు కూడా సన్నద్ధం కావాలి. పోటీ ప్రపంచంలో తట్టుకొని నిలబడటానికి ఉపాధ్యాయులు చెప్పే పాఠాలతో పాటు విద్యార్థులు కూడా ఇంటర్ నెట్‌లో లభ్యమయ్యే సమాచారాన్ని కూడా ఉపయోగించుకోవాలని అన్నారు. పరీక్షలు జరుగుతున్న ఈ సమయంలో విద్యార్థులు అందరూ బాగా చదివి ఉత్తీర్ణులు అయ్యి పై తరగతులకు వెళ్లాలి. అదేవిధంగా ఈ టాలెంట్ టెస్టులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు అందరికీ మరొక్కసారి అభినందనలు తెలియచేస్తున్నాను.



ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్‌లో మొదటి బహుమతి ఎల్.ఎగ్నితారెడ్డి (7వ తరగతి), (లాస్య ప్రియ 9వ తరగతి), రెండవ బహుమతి ఎ.వర్షన్ (4వ తరగతి), మూడవ బహుమతి రెతిక్ రాజ్ (3వ తరగతి), ఎ.బాల ఆశ్రీత్ (6వ తరగతి), ఎం.ప్రదీప్తి (7వ తర గతి)లతో పాటు ఎంపికైన విద్యార్థులకు మెడల్స్ బహుమతులు అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ప్రిన్సిపల్ ఎస్.కె.అస్మత్ బేగం, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# చౌకచర్లలో అత్యంతవైభవంగా గరుడ సేవా ఉత్సవం

## - ఉభయ కర్తలు సమాధి శ్రీనివాసులు, దంపతులకు ప్రత్యేక పూజలు



**విడవలూరు, (రాజధాని వార్తలు):** విడవలూరు మండలం చౌకచర్ల గ్రామంలో వెలిసిన కోదండ రామస్వామి ఆలయములో జరుగుతున్న శ్రీరామ నవమికి ఉత్సవాల్లో భాగంగా గరుడసేవపై స్వామి భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉభయకర్తలుగా మాజీ సర్పంచ్‌లు సమాధి శ్రీనివాసులు, సమాధి కృష్ణవేణి దంపతులు వ్యవహరిం చారు. కుటుంబ సమేతంగా ఆలయములో స్వామి కొలువులో ప్రత్యేక పూజలు చేసి స్వామి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భం గా సమాధి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజల పైన కోదండ స్వామి ఆశీస్సులు మెండుగా ఉండి ఆయురారోగ్యాలతో అందరూ అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ పూజారి పరాంకుశ కృష్ణ కిషోర్ శర్మ ప్రత్యేక పూజలు చేసి ప్రసాదలను భక్తులకు అందించారు. అనంతరం గరుడ సేవపై కోదండ స్వామి వార్లు చౌకచర్ల గ్రామంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అత్యంత భక్తికో వారి వారి కోర్కెలను తీరాలని స్వామిని వేడుకోవడం జరిగింది. పురవీదుల్లో ముగ్గులను మహిళ లు వేసి స్వామికి కానుకలు సమర్పించారు ఈ కార్యక్రమంలో ఆలయచైర్మెన్, సభ్యులు స్థానిక ప్రజలు భక్తులు తదితరులు ఉన్నారు.

# ఘనంగా రాములు వారి కళ్యాణోత్సవం

## - ఆలయ దాత కిర్తి శేషులు, ఒట్టూరు కోటేశ్వరరావు

## - అత్యంత వైభవంగా పూజలు






**కొడవలూరు, (రాజధాని వార్తలు):** కొడవలూరు మండలం మూలకట్ట సంఘం గిరిజన కాలనీలో వెలసిన శ్రీరాములు వారి ఆలయంలో శ్రీరామనవమి పండగను పునస్కరించుకొని ఉభయ కర్తలు అత్యంత వైభవంగా రాములు వారి కల్యాణన్ని నిర్వహించడం జరిగింది. ఆలయ దాత దివంగత నేత ఓట్టూరు కోటేశ్వరరావు, కుటుంబ సభ్యులు పర్యవేక్షణలో విశేష పూజలు జరిగింది. శ్రీరాముని ఆశీస్సులు మెండుగా ఉండాలని దాతలు, ఉభయ కర్తలు ఆకాంక్షించారు. మాజీ టీడీపి మహిళా అధ్యక్షురాలు. సి హెచ్ కామాక్షి యాదవ్ దంపతులు ప్రత్యేక పూజలు చేసి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిలు ఉన్నతమైన పదవులను భవిష్యత్తులో అలంకరించి నెల్లూరు జిల్లాలో ప్రజలకు మేలు జరగాలని కోరుతూ శ్రీరాములు వారిని వేడుకొన్నారు. నారా చంద్రబాబు పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని కామాక్షి యాదవ్ దంపతులు కొనియడారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు మోక్షనంద డెంటల్ ఆసుపత్రి అధినేతలు డాక్టర్ బుడతా శ్రీకర్ యాదవ్, సుజితా యాదవ్, విడవలూరు ప్రాథమిక ఆరోగ్యం కేంద్ర మెడికల్ అధికారి డాక్టర్ కరుణకర్, సుస్మిత యాదవ్ భక్తి బృందం, సభ్యులు నీలి శ్రీధర్, సుబ్బారావు, పూజారి పవన్ స్వామి, స్థానిక నాయకులు కార్యకర్తలు, గ్రామం ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# దుగ్గిశెట్టి కోటయ్య సత్రం వద్ద ఉచిత మజ్జిగ చలివేంద్రం: టీడీపి నేత చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి





**కోవూరు, (రాజధాని వార్తలు):** దుగ్గిశెట్టి కోటయ్య సత్రం అధినేత దుగ్గి శెట్టి రాంమూర్తి 20 సంవత్సరాలు కోవూరులో మజ్జిగ చలివేంద్రం నిర్వహించడం పట్ల ఎంతో సేవ అని వేసవిలో ప్రజలకు దాహార్తిని తీర్చడములో దిట్ట అని టీడీపి జిల్లా పార్లమెంట్, ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి అన్నారు. శనివారం కోవూరులో చలి వేంద్రాన్ని ప్రారంభం చేసారు. ఈ సందర్భంగా ఎన్నో సేవా కార్యక్రమంలను చేపట్టి ప్రజా మన్నలను పొందిన దాతగా దుగ్గి శెట్టికే దక్కిందనిచేజర్ల అన్నారు. దుగ్గిశెట్టి దాత్రుత్వం ఎనలేనిదని ప్రముఖ న్యాయవాది మడపర్తి రవీంద్ర అన్నారు. ఇలాంటి దాతలు అరుదుగా ఉంటారని చెప్పారు. ఎన్నో ఏళ్ల నుండి కోటయ్య సత్రం వద్ద మజ్జిగ చలివేంద్రము నడపడానికి సహకరిస్తున్న టీ.విజయకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికటీడీపి నేత ఇంటూరు విజయకుమార్ స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కుదిరిన సి.ఆర్.సి - బి.ఎన్.ఐ మధ్య అవగాహన ఒప్పందం



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ మరియు బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నే షనల్, విశాఖపట్నం మధ్య ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం వినియోగదారుల హక్కుల పరిరక్షణను బలోపేతం చేయడం మరియు నైతిక వ్యాపార పద్ధతులను ప్రోత్సహించడం లక్ష్యంగా చేసుకుంది. ఈ సందర్భంగా కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షులు డా.వికాస్ పాండే మరియు బి.ఎన్.ఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.వి.టి.రమేష్ అధికారికంగా ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా డా.వికాస్ పాండే మాట్లా డుతూ, ఈ భాగస్వామ్యం ప్రధాన ఉద్దేశ్యం వినియోగదారుల రక్షణను బలోపేతం చేయడం మరియు బాధ్యతాయుతమైన వ్యాపార సంస్కృతిని ప్రోత్సహించడం అని తెలిపారు. వినియోగ దారుల హక్కులపై అవగాహన పెంపొందించడం, వ్యాపారాలలో పారదర్శకతను పెంచడం మరియు బాధ్యతాయుత వ్యాపార విధానాలను ప్రోత్సహించడం ఈ ఒప్పందం లక్ష్యమని పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యంతో సెమినార్లు, వర్క్‌షాప్‌లు, అవగాహన కార్యక్రమాలు మరియు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. బి.ఎన్.ఐ తన సభ్యులను న్యాయం, పారదర్శకత మరియు బాధ్యతాయుత వ్యాపార విధానాలను అనుసరించేలా ప్రోత్సహించగా, కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ వినియోగదారుల చట్టాలు మరియు ఫిర్యాదు పరిష్కార వ్యవస్థలపై మార్గదర్శకత్వం అందిస్తుంది. డా. పాండే ఈ ఒప్పందం వ్యాపార సంస్థలు మరియు వినియోగదారుల మధ్య విశ్వాసాన్ని పెంపొందించే దిశగా ఒక ముఖ్యమైన అడుగు అని తెలిపారు. ఇది ఆంధ్రప్రదేశ్‌లో బాధ్యతాయుత వ్యాపార వాతావరణం మరియు అవగాహన కలిగిన వినియోగదారుల సమాజాన్ని నిర్మించడంలో సహాయపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా కె.వి.టి. రమేష్ కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ చేస్తున్న సేవలను ప్రశంసించారు. వినియోగదారుల సమస్యలను కోర్టుల్లో సమర్థంగా తీసుకెళ్లి విజయవంతంగా పరిష్కరించినందుకు అభినందించారు. ఈ ఒప్పందం పట్ల తన సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, ఈ భాగస్వామ్యం రెండు సంస్థలకు ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. వినియోగదారుల సంక్షేమం కోసం సిఆర్‌సి చేస్తున్న కృషిని ఆయన అభినందించారు.

# సంపాదకీయం

## 'మతం' చిక్కుల్లో జగన్!

పరాభవ నామ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి అనుకూలంగా లేదని వైసీపీ నిర్వహించిన ఉగాది పంచాంగ పఠనం కార్యక్రమంలో సిద్ధాంతి చెప్పారు. సాధారణంగా రాజకీయ పార్టీలు నిర్వహించే పంచాంగ పఠనాల్లో పాల్గొనే సిద్ధాంతులు ఏ రోటి కాడ పాట ఆ రోటి కాడ పాడతారన్న అభిప్రాయం ఉంది. అంటే ఆయా పార్టీలను, వాటి అధినేతలను పొగుడుతూ పంచాంగ పఠనాలు సాగుతూ ఉంటాయి. ఇందుకు భిన్నంగా వైసీపీ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న సిద్ధాంతి మాత్రం జగన్‌రెడ్డికి ఈ ఏడాది గ్రహబలం అనుకూలంగా లేదని చెప్పారు. సదరు సిద్ధాంతి చెప్పిన దాంట్లో నిజం ఎంత ఉందో తెలియదుకానీ, ఆయన చెప్పిన దానికి అనుగుణంగా రెండు పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ రెండు పరిణామాలూ జగన్‌రెడ్డికి రాజకీయంగా అంతో ఇంతో నష్టం కలిగించేవే! మతపరమైన, కుటుంబ పరమైన వివాదాలు జగన్‌రెడ్డిని చుట్టుముడుతున్నాయి. ఈ వివాదాల్లోంచి జగన్‌రెడ్డిని బయటపడేసేందుకు ఆయన మద్దతుదారులు తమ వంతు ప్రయత్నాలు మొదలెట్టారు. జగన్‌రెడ్డిలో మచ్చుకైనా కనిపించని గుణాలను ఆయనకు ఆపాదించే దుస్సాహసాలు చేస్తున్నారు. దాతృత్వంలోగానీ, కుటుంబ విలువలను పాటించడంలో గానీ వర్తమాన రాజకీయాలలో జగన్‌రెడ్డికి మరొకరు సాటిరారని ప్రచారం చేస్తున్నారు. దాతృత్వంలో కర్ణుడు కూడా జగన్‌తో సరితూగలేరని చాటిచెప్పే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇంకా నయం, సకల గుణాభిరాముడు ఆ శ్రీరామచంద్రుడు కూడా జగన్ ముందు దిగదుడుపే అని చెప్పే ప్రయత్నం చేయలేదు. అయితే సిద్ధాంతి చెప్పినట్టుగా జగన్‌రెడ్డికి గ్రహస్థితి అనుకూలంగా లేదని భావించేలా ఆయన తల్లి విజయలక్ష్మి తాజాగా ఒక లేఖ విడుదల చేశారు. తాను సంతకం చేసిన సదరు లేఖ ఒరిజినల్ కాదని వైసీపీ వాళ్లు ప్రచారం చేసే అవకాశం ఉన్నందున ఆమె తన లేఖను నోటరీ చేయించారు. ఇదొక అరుదైన సంఘటన! విజయలక్ష్మి విడుదల చేసిన ఆ లేఖలో ఆస్తుల పంపకం గురించి ప్రధానంగా ప్రస్తావించారు. 2009లో రాజశేఖరరెడ్డి మరణించేవరకు తమకు ఉన్న ఆస్తులు అన్నీ కుటుంబ ఆస్తులేనని ఆమె ఆ లేఖలో స్పష్టం చేశారు. ఆస్తుల పంపకం జరగలేదని, మొత్తం ఆస్తులను జగన్, షర్మిల పిల్లలు నలుగురికీ సమానంగా పంచాలన్నది రాజశేఖరరెడ్డి ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు. ఇది వైఎస్ ఆదేశమని కూడా ఆమె చెప్పుకొచ్చారు. ఇదే విషయాన్ని వైసీపీలో ఉన్నప్పుడు విజయసాయిరెడ్డి కూడా చెబుతుండేవారు. 'ఆస్తులన్నీ జగన్ పేరిట పెడితే ఎలా? షర్మిలకు అన్యాయం జరగకూడదు' అని రాజశేఖరరెడ్డి తనతో అనేవారని ఆయన చెప్పారు. 'ముందు ఇలాగే కానివ్వండి--అన్నీ సర్దుకున్నాక జగన్ నుంచి షర్మిలకు గిఫ్ట్‌గా ఆస్తులను బదిలీ చేయిస్తాను' అని తాను రాజశేఖరరెడ్డికి నచ్చజెప్పానని కూడా విజయసాయిరెడ్డి చెప్పేవారు. అన్నా చెల్లెళ్ల మధ్య కుదిరిన ఎంవోయూ ప్రకారం అందులో పేర్కొన్న ఆస్తులన్నీ షర్మిలకు చెందాలని, నిజానికి ఎంవోయూలో షర్మిలకు పంచిన ఆస్తులు తక్కువేనని, బెంగళూరు సమీపంలోని యలహంకలోని భూమి కూడా షర్మిలకే చెందుతుందని విజయలక్ష్మి తేల్చి చెప్పారు. ఆస్తుల పంపకం విషయంలో జగన్‌రెడ్డి ఇప్పటివరకు తన మేనల్లుడు, మేనకోడలికి అన్యాయం చేశాడని, ఎప్పటికైనా వారికి న్యాయం చేస్తాడని తల్లిగా ఆశిస్తున్నానని ఆమె తన లేఖలో పేర్కొన్నారు. 'ఆస్తుల పంపకం జరగనే లేదు. షర్మిలకు ఇచ్చామని చెబుతున్న ఆస్తుల వంటివి జగన్‌రెడ్డి పేరిట కూడా ఉన్నాయి. ఇది ఆస్తి పంపకం కాదు. నిజం ఏమిటో నా దేవుడికి, నా కొడుక్కి కూడా తెలుసు' అని ఆమె అన్నారు. గోబెల్స్ ప్రచారం చేయడానికి మీరెవరు అని జగన్‌రెడ్డి మద్దతుదారులను ఆమె ప్రశ్నించారు. 'మీరు ఎంత కాదన్నా దేవుడి న్యాయమే న్యాయం! అసత్యాల ప్రచారం మానుకోవాలని రాజశేఖరరెడ్డి భార్యగా చేతులు జోడించి అడుగుతున్నాను' అని ఆమె తన లేఖలో పేర్కొన్నారు. కుటుంబ విలువలు, దాతృత్వంలో జగన్‌రెడ్డి తనకు తానే సాటి అయితే ఈ ఆస్తుల వివాదం ఎందుకు ఉత్పన్నం అవుతున్నది అన్న ప్రశ్నకు సమాధానం కావాలి కదా! నిజానికి 2004లో రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చే నాటికి ఆ కుటుంబానికి ఇన్ని ఆస్తులు లేవు. "సండూరు పవర్ ప్రాజెక్టుకోసం 5 కోట్ల రూపాయలు కావాలని జగన్‌రెడ్డి అడుగుతున్నాడు- ఎలా సర్దుబాటు చేయాలో తెలియడం లేదు" అని పార్లమెంటు సమావేశాల సందర్భంగా రాజశేఖరరెడ్డి తన వద్ద చెప్పుకున్నారని రాజంపేట ఎంపీగా ఉండిన సాయిప్రతాప్ ఒక సందర్భంలో చెప్పారు. ఈ సందర్భంగా ఇంకో విషయమూ చెప్పుకోవాలి. 2004లో ఎన్నికలు ముగిసిన తర్వాత రాజశేఖరరెడ్డి ఢిల్లీలో సోనియాగాంధీని కలిశారు. ఆ తర్వాత బొత్స సత్యనారాయణతో మాట్లాడుతూ, 'ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నేను ముఖ్యమంత్రిని కాలేకపోతే చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకోవలసి వస్తుంది' అని రాజశేఖరరెడ్డి తన ఆవేదనను వెలిబుచ్చారు. అంటే ఇప్పుడు వివాదంలో ఉన్న ఆస్తులేవీ అప్పుడు లేవు. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాకే ఆ కుటుంబానికి ఆస్తులు కొండల్లా పెరిగాయి. అవే ఆస్తులు ఇప్పుడు కుటుంబంలో చిచ్చు పెడుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాజశేఖరరెడ్డి అవినీతి గురించి చెన్నయ్‌లోని అమెరికా రాయబార కార్యాలయంలో కాన్సులర్‌గా పనిచేసిన డేవిడ్ హాపర్ అమెరికా ప్రభుత్వానికి పంపిన ఈ మెయిల్స్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. అప్పట్లో సంచలనం సృష్టించిన వికీలీక్స్ వల్ల ఈ వ్యవహారం వెలుగు చూసింది. 2007 అక్టోబర్‌లో డేవిడ్ సదరు ఈ మెయిల్స్ పంపారు. నీటిపారుదల, గృహ నిర్మాణ రంగాలలో అవినీతి తారా స్థాయికి చేరిందని, ఈ అవినీతి వల్ల ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలన్న నిర్ణయాలను అమెరికా కంపెనీలు తీసుకోకపోవడం ఉత్తమమని డేవిడ్ స్పష్టం చేశారు.

# బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్.మాధవ్ సమక్షంలో బిజెపిలోకి చేరికలు




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బిజెపి విశాఖ పట్నం జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు వీవీచీ పరశురామరాజు ఆధ్వర్యంలో వైసిపి సీనియర్ నాయకులు నైదాన శివశేఖర్ భారతీ య జనతా పార్టీలోకి చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్.మాధవ్ పార్టీ కండు వాను కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఆర్ఎల్ఎన్. మురళి మోహన్ రాజు, బీజేపీ రాష్ట్ర బిల్డింగ్ కమిటీ మెంబర్ బొత్సా సురేష్ కుమార్, బీజేపీ శివాజీపాలెం మండల అధ్యక్షులు విఠల్ ధనరాజ్ నాయక్ మరియు అధిక సంఖ్యలో బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జ్ఞానాపురం అవర్ హ్యాండ్స్ యొక్క స్వచ్ఛంద సేవలకు విశాఖ పోలీస్ శాఖ వారి ఘన సత్కారం



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖ నగరంలో సేవా కార్యక్రమాలకు కొత్త గుర్తింపు లభించింది. "అవర్ హాండ్స్" స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న మానవతా సేవలను గుర్తిస్తూ, విశాఖ పోలీస్ కమిషనర్ శంక బ్రత భాగ్చి సంస్థ ప్రతినిధి పిల్లి గోవిందరాజుని, దుశ్శాలువావ కప్పి ఘనంగా సత్కరించారు. చౌల్ట్రీ సమీపంలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమం గౌరవప్రద వాతావరణంలో జరిగింది. అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించడం, అత్యవసర అంబులెన్స్ సేవలు అందించడం, పేదలకు వైద్య సహాయం చేయడం, అన్నార్తులకు ఉచిత భోజన సదుపాయం, వంటి అనేక సేవలను సంస్థ నిరంతరం కొనసాగిస్తోంది. ఈ కార్యక్రమంలో 5వ టౌన్ కంచరపాలెం సర్కిల్ ఇన్స్పెక్టర్ రవి కుమార్ సమన్వయం చేస్తూ వారి ద్వారా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సమాజ సేవకు లభించిన ఈ గౌరవం, మరింత సేవ చేయాలనే తపనకు ప్రేరణగా, ప్రజలకు బాసటగా నిలుస్తుందని భావించవచ్చు.

# గాజువాకలో గ్యాస్ సిలిండర్లతో డెలివరీ బాయ్ పరార్

## - ఓటీపీ చెబితే.. గ్యాస్ సిలిండర్లు మాయం

**విశాఖ, గాజువాక, (రాజధాని వార్తలు):** అమెరికా ఇరాన్ ఇజ్రాయెల్ యుద్ధం పుణ్యమా అంటూ కొన్ని ప్రపంచ దేశాల్లో పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలకు రెక్కలు వచ్చాయి. కొన్ని ప్రాంతాల్లో కృత్రిమ కొరతను సృష్టిస్తూ బ్లాక్ మార్కెట్ దందాలు చేస్తున్నారు. ముఖ్యంగా వంట గ్యాస్ వినియోగదారులు సతమతం అవుతున్నారు. సమయానికి గ్యాస్ రాక ఇంటిలో వంటలు చేసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యాపార వినియోగానికి ఉపయోగించే గ్యాస్ కూడా సక్రమంగా లభించకపోవడంతో వంట గ్యాస్‌కు డిమాండ్ పెరిగిపోయింది. దీంతో డిమాండ్‌కు సప్లైకు వ్యత్యాసం పెరిగిపోతుంది. ఈ నేపథ్యంలో డెలివరీ సమయం కూడా ఆలస్యం అవుతుంది. వంట గ్యాస్‌కు భారీ డిమాండ్ ఏర్పడడంతో దీంతో కొన్నిచోట్ల బ్యాక్ డోర్‌లో చేతివాటం చూపిస్తూనే ఆరోపణలు కూడా ఉన్నాయి. డొమెస్టిక్ సిలిండర్లను కమర్షియల్ కూడా గుట్టుగా వినియోగిస్తుండడంతో ఇప్పుడు వంట గ్యాస్‌కు మరింత డిమాండ్ పెరిగిపోతుంది. బ్లాక్‌లో ఏకంగా 3000 ధరకు విక్రయం చేస్తున్నారు బ్లాక్ మార్కెట్ గాళ్ళు. పౌరసరఫరాల అధికారులు దాడులు చేసినా ఇంకా కొన్నిచోట్ల వంట సిలిండర్లు పక్కదారి పడుతూనే ఉన్నాయన్నది జనం చెబుతున్న మాట. గ్యాస్‌కు ఉన్న డిమాండ్‌తో కొంతమంది డెలివరీ బాయ్‌లు కూడా సొమ్ము చేసుకుంటున్నారు. వైజాగ్‌లో ఓ డెలివరీ బాయ్ చేసిన పనికి అటు పోలీసులు పరుగులు పెడుతున్నారు. పౌరసరఫరాల శాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. విశాఖ గాజువాక చిన్న గంట్యాడ ప్రాంతంలో మణికంఠ గ్యాస్ ఏజెన్సీస్ నిర్వహిస్తున్నారు. ఇండేన్ గ్యాస్ సిలిండర్లు వినియోగదారులకు సప్లై చేస్తూ ఉన్నారు. బుక్ చేసుకున్న సిలిండర్లను కొంతమంది నేరుగా వచ్చి తీసుకెళ్తుంటే మరి కొంతమంది గ్యాస్ డెలివరీ బాయ్‌లతో టచ్‌లో ఉంటూ డోర్ డెలివరీ చేయించుకుంటున్నారు వినియోగదారులు. ప్రతిరోజు వందల సంఖ్యలో గ్యాస్ సిలిండర్లు డెలివరీ జరుగుతున్నాయి. అయితే తాజాగా మణికంఠ ఏజెన్సీలో పనిచేస్తున్న డెలివరీ బాయ్ అప్పారావు చేసిన పని ఇప్పుడు అందరిని పరుగులు పెట్టిస్తోంది. డెలివరీ చేయాల్సిన గ్యాస్ సిలిండర్లను పక్కదారి పట్టించి పరారయ్యాడు డెలివరీ బాయ్ అప్పారావు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 30 సిలిండర్లతో పారిపోయాడు. వాటిలో నిండు సిలిండర్లు, మరికొన్ని ఖాళీ సిలిండర్లు కూడా ఉన్నాయి. డెలివరీ బాయ్ అప్పారావు వినియోగదారులతో చాలా చనువుగా ఉండేవాడట. దీంతో అందరూ నమ్మకంగా ఉంటున్నారని విశ్వసించారు. అదే వారి కొంపముంచింది. వాస్తవానికి ఇంటికి గ్యాస్ సిలిండర్ తీసుకు వచ్చిన తర్వాత కస్టమర్లకు వచ్చిన ఓటీపీని తెలుసుకొని ఆ సిలిండర్లను గ్యాస్ డెలివరీ బాయ్ కస్టమర్లకు అప్పగించాలి. ఆన్లైన్లో డబ్బులు చెల్లించకపోతే డెలివరీ బాయ్‌కి డబ్బులు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం ఉన్న గ్యాస్ డిమాండ్‌తో ఆన్లైన్లోనే చెల్లింపులు చేస్తున్నారు చాలా మంది



వినియోగదారులు. దీంతోపాటు ఓటీపీ చెప్తేనే డెలివరీ చేస్తున్నారు. ఇదే అదనంగా చేసుకున్న డెలివరీ బాయ్ అప్పారావు కస్టమర్ల చనువుతో అప్పారావు ముందే ఓటిపి అడిగి తీసుకున్నాడు. అటు కస్టమర్లకు ఇటు గ్యాస్ ఏజెన్సీకి నమ్మకస్తుడుగా ఉండడంతో గ్యాస్ సిలిండర్లను డెలివరీ బాయ్‌కి అప్పగించారు ఏజెన్సీ నిర్వాహకులు. కస్టమర్ల నుంచి ఓటీపీలు తెలుసుకొని ఖాళీ సిలిండర్లను కలెక్ట్ చేసుకున్న అప్పారావు ఏజెన్సీ నుంచి ఫిల్ చేసిన సిలిండర్లను పట్టుకొని ఒక్కసారిగా మాయమైపోయాడు. గ్యాస్ బుక్ చేసిన తర్వాత సిలిండర్ల కోసం ఆత్రుతగా వేచి చూస్తున్న వినియోగదారులు డెలివరీ బాయ్ అప్పారావు ట్రాప్‌లో పడిపోయారు. 'అమ్మగారు మీకు గ్యాస్ వచ్చిందండి. మీ మొబైల్‌కి వచ్చిన ఓటీపీ చెప్పండి. ఈరోజే డెలివరీ చేసేస్తాను' అంటూ కస్టమర్లకు కాల్ చేశాడు డెలివరీ బాయ్ అప్పారావు. అప్పటికే సిలిండర్ల కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్న వినియోగదారులంతా కాల్ వచ్చిన వెంటనే అప్పారావుకు ఓటిపిని చెప్పేశారు. గ్యాస్ డెలివరీ అవుతుందని వేచి చూస్తున్నారు కస్టమర్లు. ఎంతకీ గ్యాస్ డెలివరీ కాకపోవడంతో డెలివరీ బాయ్ కి కాల్ చేశారు. డెలివరీ బాయ్ మొబైల్ స్విచ్ ఆఫ్ వచ్చింది. తీవ్ర ఆందోళన చెందిన వినియోగదారులు మణికంఠ గ్యాస్ ఏజెన్సీని సంప్రదించారు. తాము వారం రోజులు క్రితమే గ్యాస్ డెలివరీ చేసినట్టు ఏజెన్సీ నిర్వాహకులు కస్టమర్లకు సమాధానం చెప్పడంతో మరోసారి షాక్ అయ్యారు. అసలు విషయాన్ని వినియోగదారులు చెప్పడంతో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు జరిగిన సంఘటనపై దర్యాప్తు ప్రారంభించారు.

# పట్టపగలే చోరీ...వృద్ధురాలి గాజులు, గొలుసు అపహరణ



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట పట్టణంలోని కొత్తూరు వీధిలో పట్టపగలే ఒక ఇంటిలో దొంగలు చొరబడి చోరీకి పాల్పడ్డారు. ఆ గృహంలో ఉన్న వృద్ధురాలు ధరించిన ఒక చైను, చేతి గాజులు లాక్కొని దొంగలు పారిపోయారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలు మలిరెడ్డి సూర్యకాంతం ను గమనించి ఈ చోరీకి పాల్పడ్డారు. వృద్ధురాలిపై జరిగిన చోరీ ఘటన పట్ల కుటుంబీ కులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దానితో స్థానిక సిఐ ఎ కృష్ణ భగవాన్ చోరీ జరిగిన ఇంటికి చేరుకొని బాధితురాలు మలిరెడ్డి నల్ల అబ్బాయి బార్య సూర్యకాంతం (88) వద్ద వివరాలు సేకరించారు. అయితే భాధితురాలు మాటలు విని సిఐ, స్థానికులు షాక్‌కు గురయ్యారు. చోరీకి గురైన చైను, గాజులు రోల్డ్ గోల్డ్ అంటూ వృద్ధురాలు చెప్పడంతో అక్కడున్న పోలీసులతో పాటు ప్రజాప్రతినిధులు ఆశ్చర్యానికి లోన య్యారు. పోగొట్టుకున్న వస్తువులు రోల్డ్ గోల్డ్ అయినప్పటికీ ఉద్దేశ్య పూర్వకంగానే దొంగతనం జరిగినందున దొంగలను పట్టుకునే విషయంలో పోలీసులు యధావిడిగా దర్యాప్తు చేపట్టాలని నాయకులు, స్థానికులు కోరుతున్నారు.

# కరప సొసైటీలో జనరల్ బాడీ సమావేశం



**కరప, (రాజధాని వార్తలు):** కరప సహకార సంఘం ఆధ్వర్యంలో శనివారం జనరల్ బాడీ సమావేశం సంఘ చైర్మన్ సైనవరపు భవాని శంకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం కార్యకలాపాలు, ఆర్థిక పరిస్థితి, రైతులకు అందిస్తున్న సేవలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు మాట్లాడుతూ సభ్యుల చేరిక వివరాలను వెల్లడించారు. రైతు నేస్తం పథకం కింద సుమారు రూ.49 లక్షల వరకు రుణాలను రైతులకు మంజూరు చేసినట్లు తెలిపారు. సంఘానికి సీడీఎఫ్ నిధుల ద్వారా రూ.4,81,000 మంజూరైందని, పీపీసీ కమిషన్ రూపంలో రూ.3,02,000 ఆదాయం వచ్చినట్లు సభ్యులకు వివరించారు. గత ప్రభుత్వ కాలంలో కొందరి తప్పిదాల కారణంగా సొసైటీపై సుమారు రూ.3.50 కోట్ల డిమాండ్ నోటీసు వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ సమయంలో సొసైటీ ఖాతాలను అధికారులు జప్తు చేయగా రూ.10 లక్షలు చెల్లించి తాత్కాలికంగా విడుదల చేయించుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సైనవరపు భవాని శంకర్ ఈ సమస్యను ఎమ్మెల్యే పంతం నానాజీ దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. వారి మార్గదర్శకత్వంలో ఎటువంటి అదనపు భారం లేకుండా సమస్యను పూర్తిగా పరిష్కరించినట్లు వెల్లడించారు. గతంలో చెల్లించిన రూ.10 లక్షలను వడ్డీతో సహా తిరిగి పొందినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంఘ సభ్యులు, రైతులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# కరపలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం



**కరప, (రాజధాని వార్తలు):** కరప మండలం స్థానిక పంచాయతీ పరిధిలో డిప్యూటీ ఎంపీడీవో సలాది వెంకట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వచాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో "ఇంటింటా వ్యర్థాల వర్గీకరణ, శూన్య వ్యర్థ జీవన విధానం" అనే అంశంపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటింటా చెత్తను తడి, పొడి వ్యర్థాలుగా వేరు చేసి ఇవ్వడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పర్యావరణాన్ని కాపాడడం వంటి విషయాలపై అధికారులు వివరించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముద్రగడ రమేష్, టీడీపీ నాయకులు దేవు వెంకన్న, పంచాయతీ కార్యదర్శి ఎం.శివ రామకృష్ణ, బిల్ కలెక్టర్ త్రిమూర్తులు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాలయ్య బ్యూటీకి అవమానం.. అసభ్యకరంగా తాకుతూ!



సినిమా తారలు కనిపిస్తే చాలు ఒక సెల్ఫీ దిగాలని, కనీసం ఒక్కసారైనా వారిని తాకాలని అభిమానులు ఆరాట పడుతుంటారు. అయితే ఈ అభిమానం కొన్నిసార్లు హద్దులు దాటి హీరోయిన్లకు చేదు అనుభవంగా మారుతోంది. తాజాగా 'వీరసింహారెడ్డి' ఫేమ్ హనీ రోజ్ ఒక షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో ఆకతాయిల వల్ల తీవ్ర ఇబ్బందికి గురయ్యారు. సెల్ఫీల వంకతో ఆమెను అసభ్యంగా తాకుతూ కొందరు ప్రవర్తించిన తీరు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ కావడంతో పాటు సెలబ్రిటీల భద్రతపై ఆందోళన కలిగిస్తోంది. ఆ వివరాలు చూద్దాం..

కోజికోడ్‌లో చేదు అనుభవం: మలయాళ నటి హనీ రోజ్ కేరళలోని కోజికోడ్‌లో ఒక ప్రముఖ జ్యువెలరీ షాపును ప్రారంభించడానికి వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగింది. ఆమెను చూడటానికి జనం భారీగా తరలి రావడంతో అక్కడ విపరీతమైన తోపులాట జరిగింది. ఈ క్రమంలో కొందరు ఆకతాయిలు హనీ రోజ్‌తో సెల్ఫీలు తీసుకునే వంకతో ఆమెకు అతి సమీపంలోకి వచ్చి అసభ్యంగా ప్రవర్తించారు. ఆమె నడుముపై, చేతులతో తాకుతూ ఇబ్బంది పెట్టడంతో ఆమె తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. జనం మధ్యలో ఉండటంతో ఆమె ఏమీ అనలేక సైలెంట్‌గా అక్కడి నుంచి వెళ్ళిపోయారు. హద్దులు దాటుతున్న అభిమానం: సెలబ్రిటీలను చూడాలనే ఉత్సాహం ఉండొచ్చు కానీ, వారి వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించేలా ప్రవర్తించడం అస్సలు సభ్యత అనిపించుకోదు. హనీ రోజ్‌కు ఎదురైన ఈ అనుభవం చూస్తుంటే బహిరంగ ప్రదేశాల్లో హీరోయిన్లకు రక్షణ కరువవుతోందని స్పష్టమవుతోంది. ఇక దీనికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటంతో, నెటిజన్లు ఆ ఆకతాయిల ప్రవర్తనపై తీవ్రంగా మండిపడుతున్నారు. అభిమానం పేరుతో ఇలాంటి పనులు చేయడం వల్ల సినిమా తారలు బయటకు రావడానికే భయపడే పరిస్థితి వస్తోంది. గతంలోనూ ఇలాంటి ఘటనలే: కేవలం హనీ రోజ్ మాత్రమే కాదు, గతంలో నిధి అగర్వాల్, రష్మీ గౌతమ్ వంటి వారికి కూడా ఇలాంటి చేదు అనుభవాలే ఎదురయ్యాయి. షాపింగ్ మాల్స్ లేదా ఈవెంట్లకు వెళ్ళినప్పుడు జనం ఒక్కసారిగా మీద పడటం వల్ల బాడీగార్డ్స్ ఉన్నా నియంత్రించడం కష్టమవుతోంది. ముఖ్యంగా హీరోయిన్ల విషయంలో కొందరు కావాలనే అసభ్యంగా తాకడానికి ప్రయత్నిస్తున్న ఘటనలు పెరిగిపోతున్నాయి. ఇలాంటి ప్రవర్తన వల్ల సదరు హీరోయిన్లు మానసికంగా ఎంతో వేదనకు గురవుతుంటారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే నిర్వాహకులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కేవలం బౌన్సర్లను నమ్ముకోకుండా, క్రౌడ్ మేనేజ్‌మెంట్‌లో కొత్త పద్ధతులను అనుసరించాలి. అభిమానులు కూడా తమ అభిమానాన్ని గౌరవప్రదంగా చాటుకోవాలి కానీ, పక్క వారిని ఇబ్బంది పెట్టేలా ఉండకూడదు. సెలబ్రిటీల ప్రైవసీని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత.

# చిరు బాబీ మూవీ.. ఇప్పుడు మరో టెన్షన్..



మెగాస్టార్ చిరంజీవి నటించనున్న కొత్త సినిమా ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. దర్శకుడు బాబీతో ఆయన కాంబినేషన్ ఇప్పటికే వాల్తేరు వీరయ్య రూపంలో భారీ విజయాన్ని అందుకుంది. ఆ సినిమా మాస్ ఎంటర్టైనర్‌గా ఆకట్టుకోవడంతో, ఆ కాంబోపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ఇప్పుడు అదే జోడీ మరోసారి కలిసి పనిచేయనున్న నేపథ్యంలో ఆ ప్రాజెక్ట్ పై ఆసక్తి నెలకొంది. ఆ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. ప్రారంభం నుంచే ఆ సినిమా మీద భారీ హైప్ ఉండగా, మధ్యలో కొన్ని రూమర్స్ అభిమానులను ఆందోళనకు గురి చేశాయి. ముఖ్యంగా కేవీఎన్ ప్రొడక్షన్స్ ఆర్థిక సమస్యల్లో ఉందన్న వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో ఆ ప్రాజెక్ట్ ఆగిపోతుందా అనే సందేహాలు మెగా ఫ్యాన్స్‌తోపాటు సినీ ప్రియుల్లో కలిగాయి. అయితే ఆ ఊహాగానాలపై నిర్మాణ సంస్థ స్పందించింది. తమపై వస్తున్న వార్తల్లో నిజం లేదని, అన్ని ప్రాజెక్టులు ప్లాన్ ప్రకారం ముందుకు సాగుతున్నాయని క్లారిటీ ఇచ్చింది. దీంతో అభిమానులు కొంత ఊరట పొందారు. సినిమా పనులు సజావుగా కొనసాగుతున్నాయని ఫిక్స్ అయ్యారు. అదే సమయంలో కథ విషయంలో మరో చర్చ మొదలైంది. స్క్రిప్ట్ పై చిరంజీవి సంతృప్తి చెందలేదన్న టాక్ వినిపించింది. ముఖ్యంగా సెకండ్ హాఫ్‌పై ఆయన అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఫ్యాన్స్ అంచనాలు ఎక్కువగా ఉన్నందున, ఈసారి కథ విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని మెగాస్టార్ భావిస్తున్నారట. అందుకే స్క్రిప్ట్‌ను మరింత బలంగా తయారు చేయాలని దర్శకుడు బాబీకి సూచించినట్లు తెలుస్తోంది. దీనిపై బాబీ కూడా సీరియస్‌గా వర్క్ చేస్తున్నారని సమాచారం. కథను మరింత ఆకట్టుకునేలా మార్చేందుకు టీమ్ కష్టపడుతుందని తెలుస్తోంది. ఈ పరిణామాలతో కథ విషయంలో ఉన్న అనుమానాలు కొంత వరకు తగ్గినట్లే కనిపించాయి. అయితే తాజాగా మరో అంశం ఫ్యాన్స్‌లో టెన్షన్ పెంచుతోంది. ఆ సినిమాకు రచయితగా కోన వెంకట్ పనిచేస్తున్నట్లు ఆయనే స్వయంగా వెల్లడించారు. గతంలో కోన వెంకట్ వరుస హిట్స్ ఇచ్చినప్పటికీ, ఇటీవల ఆయన నుంచి వచ్చిన సినిమాలు ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేదు.

# సంచలన ఫ్రాంచైజ్ నుంచి పార్ట్ – 6



అత్యంత సుదీర్ఘకాలం కొనసాగిన ఇన్వెస్టిగేషన్ ఫ్రాంచైజీగా మలయాళం 'సీబీఐ' సిరీస్ ఒక ప్రత్యేక రికార్డును సొంతం చేసుకుంది. ఈ సిరీస్ నుంచి రిలీజ్ అయిన ఐదు భాగాలు మంచి విజయం సాధించాయి. తాజాగా ఈ సంచలన ఫ్రాంచైజీ నుంచి ఆరవ భాగం సీబీఐ 6ను పట్టాలెక్కించేందుకు రంగం సిద్ధమవుతోంది. మాలీవుడ్ మెగాస్టార్ మమ్ముట్టి మరోసారి తన ఐకానిక్ పాత్ర సేతురామ అయ్యర్‌గా వెండితెరపై మ్యాజిక్ చేసేందుకు రెడీ అవుతున్నారు. ఈ ఫ్రాంచైజీలో ఇప్పటి వరకు వచ్చిన ఐదు భాగాలు కూడా బాక్సాఫీస్ వద్ద ఘనవిజయం సాధించడమే కాదు. మమ్ముట్టి కెరీర్‌లో మైలురాళ్లుగా నిలిచాయి. 1988లో 'ఒరు సీబీఐ డైరీ కురిప్పు' తో మొదలైన ప్రయాణం 2022లో రిలీజ్ 'సిబిఐ 5: ది బ్రెయిన్' వరకు విజయవంతంగా కొనసాగింది. మేధస్సుతో క్లిష్టమైన కేసులను ఛేదించే నిశబ్ద ఆఫీసర్‌గా సేతురామ అయ్యర్ పాత్రకు మమ్ముట్టి ప్రాణం పోశారు. ఆయన కాకపోతే ఆ పాత్ర అంతగా పండేది కాదేమో అన్నంతగా సేతురామ పాత్రలో ఒదిగిపోయారు. దీంతో ఆరవభాగంలో కూడా ఆయనే ప్రధాన పాత్రలో కొనసాగుతున్నారు. అయితే ఆరవ భాగంలో ఓ కీలకమైన మార్పు చోటు చేసుకుంది. మొదటి ఐదు భాగాలకు లెజెండరీ డైరెక్టర్ కె.మధు దర్శకత్వం వహించగా ఆరవ భాగం బాధ్యతలు యువ దర్శకుడు జోపిన్ టీ చాకో చేతుల్లోకి వెళ్లాయి. గతంలో మమ్ముట్టితో 'తోప్పిల్ జోప్పన్' వంటి చిత్రాలను తెరకెక్కించిన జోపిన్ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్‌ను ఆధునిక హంగులతో సరికొత్త కోణంలో ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నారని తెలుస్తోంది. దర్శకత్వంలో మార్పు వచ్చినప్పటికీ ఈ సిరీస్ ఆత్మ అయిన సేతురామ అయ్యర్ నడక, ఆ ఆలోచనా శైలి, నేపథ్య సంగీతం ఏమాత్రం తగ్గకుండా ఉండేలా మేకర్స్ జాగ్రత్త పడుతున్నారు. కొత్త తరం ప్రేక్షకులను కూడా ఆకట్టుకునేలా కథా గమనం ఉండబోతోందని యూనిట్ వర్గాల సమాచారం. మమ్ముట్టి తన 70వ ఏటా కూడా అదే ఉత్సాహంతో ఫిట్‌నెస్‌తో సేతు రామ పాత్రలోకి పరకాయ ప్రవేశం చేయడానికి రెడీ అవుతు న్నారు. పార్ట్ 6ని మరింత ప్రతిష్టాత్మకంగా ప్లాన్ చేస్తున్నారు. గత కొంత కాలంగా మమ్ముట్టి తమిళ, తెలుగు భాషల్లో కూడా విరివిగా సినిమాలు చేస్తోన్న సంగతి తెలిసిందే. దీంతో ఆయన ఇమేజ్ కూడా రెట్టింపు అయింది. సీబీఐ సిరీస్ కు మలయాళంతో పాటు తెలుగు, తమిళ భాషల్లో కూడా మంచి ఆదరణ దక్కింది.

ఈ నేపథ్యంలో క్రైమ్ థ్రిల్లర్లు ఇష్టపడే ప్రేక్షకులకు 'సీబీఐ 6' అన్నది ఎంతో ఎగ్జైట్‌మెంట్‌ను తీసుకొచ్చేదే. డైరెక్టర్ మధు సెట్ చేసిన ఆ బెంచ్ మార్క్‌ను జోపిన్ ఏ మేరకు అందుకుంటారో? చూడాలి.

# వైఫల్యమే ఉత్తమ గురువుగా నిర్దేశించుకున్న నటి!



సినీ పరిశ్రమలో అడుగుపెట్టిన ప్రతి నటికీ సక్సెస్ అనేది ఓ కల. వైఫల్యాలను స్వీకరించి వాటి నుంచి పాఠాలు నేర్చుకోవడం అనేది అంతకుమించిన మరో గొప్ప కళ. బాలీవుడ్ కథానాయిక కృతి సనన్ ఈ విషయంలో అందరికీ ఆదర్శంగా నిలుస్తుంది. తనకు ఎదురైన ప్రతి పరాజయాన్ని ఒక అపజయంగా కాకుండా తనను తాను మెరుగుపరుచుకునే ఒక ఉత్తమ గురువుగా భావిస్తూ ముందుకు సాగుతోంది. వృత్తిపరమైన ప్రయాణంలో కృతిసనన్ ఎప్పుడూ ఒకే పద్ధతికి పరిమితం కాలేదు. గ్లామర్ పాత్రల నుంచి నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రల వరకు ఆమె ఎంచుకున్న ప్రతి సినిమా ఒక ప్రయోగమే. అయితే కొన్ని సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలను అందుకోలేకపోయినప్పుడు ఆమె నిరాశకు గురికాకుండా ఆ వైఫల్యాల వెనుక ఉన్న కారణాలను విశ్లేషించుకుంటుందిట. ఒక నటిగా తనలో ఇంకా ఎలాంటి మార్పులు అవసరమో? తెలుసుకోవడానికి ఈ అనుభవాలే ఆమెకు దిశానిర్దేశం చేస్తాయంది. ప్రస్తుత తరం నటీమణులలో కృతి సనన్ ఎంతో పరిణతితో వ్యవహరిస్తుంది. ఒక సినిమా ఫ్లాప్ అయితే దాన్ని తన బాధ్యతగా స్వీకరిస్తానంది. తదుపరి ప్రాజెక్టులో తప్పులు జరగకుండా జాగ్రత్త తీసుకుంటానంటోంది. వైఫల్యం కలిగించే బాధను భరిస్తూనే దాని నుంచి వచ్చే పాఠాన్ని తన నటనలో ప్రతిబింబింపజేయడం అమ్మడి ప్రత్యేకతగా చెప్పుకొచ్చింది. అందుకే మిమీ వంటి చిత్రంలో అమ్మడిలో అసలైన నటిని ప్రేక్షకులకు పరిచయం చేసానంది. నటనలోనే కాకుండా కథల ఎంపికలో కూడా కృతి సనన్ వైఫల్యాల నుంచి నేర్చుకున్న పాఠాలు కెరీర్ ఎదుగుదలకు ఎంతో దోహదం చేసింది. పరాజయాలు ఎదురైనప్పుడు కెరీర్ పట్ల మరింత కఠినంగా నిర్ణయాత్మకంగా వ్యవహరించడం కృతి సనన్ శైలిగా చెప్పుకొచ్చింది. తనను తాను నమ్ముకుని ప్రతి వైఫల్యాన్ని ఒక మెట్టుగా మలుచుకుంటానంది. అంతటి ప్రతిభావంతురాలు కావడంతోనే జాతీయ ఉత్తమ నటిగా అవార్డు సైతం అందుకోగల్గింది. ఈ విషయంలో కృతిసనన్ ఎంతో మంది సీనియర్లను సైతం వెనక్కి నెట్టి రేసులో నిలిచింది. అమ్మడికి జాతీయ అవార్డు ఎంతో నిజాయితీగా వచ్చింది. ఆ రకంగా కృతి సనన్ నేటి తరం నటీమణులకు ఒక ప్రేరణగా నిలుస్తుంది. ప్రస్తుతం ఈ బ్యూటీ బాలీవుడ్ సినిమాలతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. అలాగని అక్కడికే పరిమితం కాలేదు. ఇతర భాషల్లోనూ మంచి అవకాశాలు వస్తే సద్వినియోగం చేసుకుంటుంది. మహేష్ హీరోగా నటించిన వన్ సినిమాతో టాలీవుడ్‌లోనూ లాంచ్ అయింది. అటుపై మరో రెండు ..మూడు తెలుగు సినిమాలు చేసింది. కానీ ఇక్కడ అనుకున్నంతగా సక్సెస్ అవ్వలేదు. దీంతో తిరిగి బాలీవుడ్‌కి వెళ్లి అక్కడే నిలదొక్కుకుంది.

# శ్రీరామ స్థూపంలో రామకోటి పుస్తకాల సమర్పణ



**విజయనగరం,(రాజధాని వార్తలు):** ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణంలో చైత్ర మాసం దశమి సందర్భంగా భక్తులు వ్రాసిన రామకోటి పుస్తకాలు శ్రీ వేంకటేశ్వర వేద విజ్ఞాన పీఠం వేద విద్యార్థుల వేద పఠనం నడుమ 5,10,31,045 నామాలు శ్రీరామ స్థూపంలో సమర్పించారు. ఇప్పటివరకు 47, 57,85,585 నామాలు సమర్పించినట్లుగా నమోదు చేశారు. ఈ ఉత్సవంలో ట్రస్ట్ సభ్యులు నారాయణం నాగేశ్వర రావు, పద్మావతి దంపతులు, పద్మశ్రీ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

# 10వ తరగతి విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేసిన పూర్వ విద్యార్థి



**మక్కువ, (రాజధాని వార్తలు):** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షకు హాజరైన విద్యార్థులకు ఎండల తీవ్రత దృశ్య ఉచితంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. విద్యార్థులకు మజ్జిగ అందించేందుకు ఇదే పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి బూరాడ మణికంఠ తోడ్పాటునందించారు. ఎండల తీవ్రత సమయంలో ఉచితముగా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయడం పట్ల విద్యార్థులు మజ్జిగ వితరణ చేసిన పూర్వ విద్యార్థికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమములో పలువురు యువత పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఆరోగ్య పరీక్షలు ప్రారంభం





**విజయనగరం,(రాజధాని వార్తలు):** జిల్లాలోని అక్రిడేటెడ్ జర్నలిస్టులకు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా, జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక తిరుమల మెడికవర్ ఆసుపత్రిలో ఈ వైద్య పరీక్షలను నిర్వహించారు. మొదటిరోజు పరీక్షలకు 25 మంది జర్నలిస్టుల కుటుంబాలకు చెందిన మొత్తం 45 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.

బిపి, సుగర్, కంప్లీట్ బ్లడ్ పిక్చర్, 2డి ఎకో తదితర ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. అనంతరం ఐదుగురు వైద్య నిపుణులు వారికి తనిఖీలు చేశారు. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖాధికారి పి.గోవిందరాజులు, తిరుమల మెడికవర్ ఎం.డి డాక్టర్ తిరుమల ప్రసాద్, మెడికవర్ సెంటర్ హెడ్ పవన్ కుమార్, ఇతర అధికారులు పర్యవేక్షించారు.

# బస్సు ప్రమాదం బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్న మంత్రులు

## - మణెమ్మ, మరో మహిళకుకు ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యే ఇంటూరి



**ఒంగోలు, (రాజధాని వార్తలు):** మార్కాపురం మండలం రాయవరం సమీపంలో జరిగిన బస్సు ప్రమాదంలో గాయపడి ఒంగోలు రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అన్ని ప్రాంతాలకు చెందిన బాధితులను రాష్ట్రమంత్రులు డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజ నేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్ లతో పాటు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఒంగోలు దామచర్ల జనార్ధన్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బి.ఎన్.విజయ్ కుమార్, ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్ తదితరులు పరామర్శించారు. పలు వార్డుల్లో చికిత్స పొందుతూ ఉన్న13 మంది బాధితులతో మంత్రులు, ఎమ్మెల్యేలు స్వయంగా మాట్లాడి ప్రమాదం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఒంగోలులోని రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉన్న కందుకూరు నియోజకవర్గం వలేటివారి పాలెం మండలం అంక భూపాలపురం గ్రామానికి చెందిన బత్తుల మణెమ్మకు రెండు చేతులు విరిగిపోగా, లివర్‌కు కూడా గాయం కావడంతో ఆపరేషన్ చేశారు. మరొక మహిళ గాయాల పాలై చికిత్స పొందుతూ ఉంది. ఈ విషయం వెలుగులోకి రావడంతో వలేటివారిపాలెం మండలానికి చెందిన సీనియర్ న్యాయవాది ప్రగడ. శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎంపీపీ భర్త సోమరాజు తదితరులతో కలిసి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావు మణెమ్మ ఉన్న వార్డుకు వెళ్ళి ఆ ఇద్దరినీ పరామర్శించి ప్రత్యేకంగా ఆర్థిక సహాయం అందించి వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. బస్సు ప్రమాద ఘటనలో చనిపోయిన వారితో పాటు గాయాల పాలైన వారిని కూడా ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆదుకుంటుందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మణెమ్మ, మరో మహిళకు తెలిపారు. రాష్ట్ర మంత్రులు సహచర ఎమ్మెల్యేలతో కలిసి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆ ఇద్దరినీ పరామర్శించారు. డాక్టర్లతో మాట్లాడి చికిత్స వివరాలు అడిగి తెలుసుకున్నారు. బత్తుల మణెమ్మ భర్త వెంకటయ్యతో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు స్వయంగా మాట్లాడిన అనంతరం ఆర్థిక సహాయం అందించారు. తీవ్ర గాయాల పాలైన మణెమ్మ, మరొక మహిళ త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే ఇంటూరి ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే నాగేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ బస్సు ప్రమాదంలో 14 మంది చనిపోవడం అత్యంత బాధాకరమైన సంఘటన అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, గాయపడ్డవారు పూర్తిగా కోలుకునేంతవరకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఇలాంటి ప్రమాదం మరోసారి జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇదిలా ఉండగా బస్సు ప్రమాదంలో చనిపోయిన వారికి రాష్ట్ర ప్రభుత్వం 5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం 2 లక్షలు గాయాల పాలై వివిధ ప్రాంతాల్లో ఉన్న వైద్యశాలల్లో చికిత్స పొందుతూ ఉన్న క్షతగాత్రులకు రాష్ట్ర ప్రభుత్వం 2 లక్షలు, కేంద్ర ప్రభుత్వం 50 వేలు ప్రకటించిన విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరుపున మంత్రులు డాక్టర్ స్వామి, గొట్టిపాటి రవి కుమార్ తదితరులు ప్రమాద బాధిత కుటుంబ సభ్యులకు తెలియ జేశారు.కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు వెంట అంకభూపాలపురం టిడిపి సీనియర్ నాయకులు, న్యాయవాది పెగడ శ్రీనివాసులు యాదవ్, బండారు సోమరాజు తదితరులు ఉన్నారు.

# "విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి"



**విజయనగరం,(రాజధాని వార్తలు):** వృద్ధులకు వయసు నిర్ధారణ పత్రాలు ఇవ్వటంలో తీవ్ర జాప్యం చేస్తున్న అధికారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జనజాగృతి సంస్థ ఉత్తరాంధ్రా కన్వీనర్ శీరాపు శ్రీనివాసరావు బుధవారం స్థానిక ఎమ్మెల్యే పి. అదితి విజయలక్ష్మి గజపతి నిక్యాంప్ ఆఫీస్‌లో కలిసి వినతిపత్రం ఇచ్చానని పాత్రికేయులతో చెప్పారు. ఈ మేరకు అతను వినతిపత్రం నకలును అందజేశారు. మన జిల్లాలో 3,733 మంది వృద్ధులు వయసు నిర్ధారణ పత్రాలు అందక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. విజయనగరం ప్రభుత్వ జిల్లా జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు సంబంధిత వృద్ధుల జాబితాను కవరింగ్ లెటర్ ను స్థానిక.డి. ఆర్. డి. ఎ. కార్యాలయం ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.సి. నెంబర్. 178/2022.ఎస్.ఏ.ను. 2023 నవంబర్ 17వ తేదీన పంపారని నేటికీ రెండేళ్లు పైబడిన వృద్ధులకు జి.జి.హెచ్. సురింటెండె శీటు వయసు నిర్ధారణ పత్రాలు ఇచ్చే ప్రక్రియ ప్రారశీభించ లేదని అన్నారు. వయసు నిర్ధారణ పత్రం ఇప్పించ మని కోరుతూ దాసన్న పేట, ప్రశాంత్ నగర్‌కు చెందిన వృద్ధుడు కర్రి సూర్య నారాయణ జిల్లా కలెక్టర్ కర్యాలయంకు వచ్చి స్పందన ప్రో గ్రాంలో అర్జీ ఇచ్చాడు మూడేళ్లు గడిచినా ఫలితం సూన్యం అతను అనారోగ్యంతో మరణించాడు అధికారుల నిర్లక్ష్యంకు సూర్యనారాయణ బలై పోయాడు. అధికారులు వయసు నిర్ధారణ పత్రాలు ఇచ్చేటప్పటికి 3,733 మందిలో ఎంత మంది మరణిస్తారో అని శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తశీ చేసారు. 3,733 మంది వృద్ధుల్లో ఎంతమంది మరణించారో అన్న విషయమై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు తాను తేది.30.06.2025 మరియు 2025 నవంబర్ 30వ తేదీన విజయనగరం జిల్లా కలెక్టర్ కర్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక ప్రోగ్రాంలో అర్జీలు ఇచ్చానని చెప్పారు. అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో వృద్ధులకు వయసు నిర్ధారణ పత్రాలు ఇవ్వాలని అర్హత వున్నవారికీ వృద్ధాప్య పింఛన్లు ఇవ్వాలని ఎమ్మెల్యేకు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు. తేది. 9.7.2026న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉపముఖ్య మంత్రిపవన్ కళ్యాణ్‌కు స్పీడ్ పోస్ట్‌లో వినతిపత్రాలు పంపానని శ్రీనివాసరావు చెప్పారు.

# సీతారామస్వామి ఆలయంలో అయోధ్య రాముడి పట్టాభిషేకం

## - అయోధ్య రాముడి పట్టాభిషేకం మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు జరిపిన ప్రముఖ న్యాయవాది ఉప్పలపాటి రమేష్ రాజు - రమాదేవి దంపతులు

**గజపతినగరం, (రాజధాని వార్తలు):** గజపతినగరం దిగువ వీధిలో ఉన్న దేవాలయాల సముదాయంలో గల సీతారామస్వామి వారి ఆలయం లోపల తిరుమల తిరుపతి దేవస్థానం వేద పండితులు వేదుల భువనేశ్వర ప్రసాద్ శర్మ పర్యవేక్షణలో, ఆలయ ప్రధాన అర్చకులు బృందావనం వెంకట రాఘవాచార్యులు గారి ఆధ్వర్యంలో అర్చకులు చంద్రమౌళి, ఎం.వి.ఎస్.కే శర్మల మంత్రోచ్చారణల మధ్య శనివారం నాడు అయోధ్య రాముడి పట్టాభిషేకం వేడుకగా జరిగింది. అయోధ్య రాముడి పట్టాభిషేకం మహోత్సవంలో ఉప్పలపాటి రమేష్ రాజు - రమాదేవి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. పట్టాభిషేకంలో పాల్గొన్న ఉప్పలపాటి రమేష్ రాజు మాట్లాడుతూ శ్రీరాముడు ధర్మతత్పరుడు కాబట్టి ప్రతి గ్రామంలో ధర్మం నాలుగు పాదాలుగా నడవాలనే ఉద్దేశంతోనే గ్రామాలలో సీతారాముల కళ్యాణం ఉత్సవం మరుచటి నాడు అయోధ్య రాముడి పట్టాభిషేకం జరుపుతున్నారని అన్నారు. అదేవిధంగా గజపతినగరం సీతారామస్వామి ఆలయంలో గడిచిన 12 సంవత్సరాల నుంచి శ్రీరామనవమి నాడు జరిగే సీతారాముల కల్యాణోత్సవం తర్వాత రోజు అయోధ్య రాముడి పట్టాభిషేకం జరపడం ఆనవాయితీగా వస్తుందని వేద పండితులు విలేకరులకు తెలియజేశారు.




# దగదర్తిలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహణ



**కావలి, (రాజధాని వార్తలు):** దగదర్తి మండల ప్రభుత్వ కార్యాలయాల సముదాయ ఆవరణలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దగదర్తి మండల టిడిపి ఇన్చార్జ్, మాజీ ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ మాలేపాటి రవీంద్ర నాయుడు అధికారులతో కలిసి పాల్గొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పంచాయతీరాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి సంస్థ చేపట్టిన పనులపై సమగ్ర విచారణ జరిపారు. ఈ సందర్భంగా పనుల అమలు, నిధుల వినియోగం, పారదర్శకతపై అధికారులు వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కంచర్ల సునీల్, మాలేపాటి సుధాకర్ నాయుడు, కంచర్ల కృష్ణతో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# "స్వచ్ఛరథం ప్రారంభోత్సవం"... వ్యర్థాలివ్వండి..నిత్యావసరాలు తీసుకోండి

**కోట, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా కోట మండలం మండల పరిషత్ కార్యాలయం నందు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు పలగాటి భాస్కర్ రెడ్డిగారు జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్, ఎంపిపి వేమారెడ్డి సౌజన్య రెడ్డి, ఎంపీడీవో దిలీప్ కుమార్ నాయక్ "స్వచ్ఛ రథం" ప్రారంభోత్సవంని రిబ్బన్ కటింగ్ చేసి టెంకాయ కొట్టి ప్రారంభించారు. ఇంటింటికీ వచ్చే 'స్వచ్ఛ రథం'కు పనికి రాని ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, ప్యాకెట్లు, గాజు సీసాలు, పేపర్లు, పుస్తకాలు, అట్టపెట్టెలు, నూనె డబ్బాలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, ఇనుము, స్టీల్, అల్యూమినియం తదితర వస్తువులు ఇవ్వవచ్చు విద్యార్థులను తూకం వేసి అందుకు సమానమైన నగదు లెక్కించి సరిపడా నిత్యావసర సరకులు ఇస్తారు సబ్బులు,టూత్‌పేస్టులు, ఉల్లిపాయలు వంటి 20 రకాల నిత్యావసర వస్తువులు ఉంటాయి ప్రతి గ్రామంలో 25 రోజులకు వెళ్ళేలా ప్రణాళిక రూపొందించారు,"స్వచ్ఛ రథం" మీ ఇంటి ముందుకు వస్తే..వ్యర్థాలివ్వండి.. నిత్యావసరాలు తీసుకోండి గ్రామాలు పరిశుభ్రంగా మారటం, వ్యర్థాలకు నిత్యావసరాలు ఇంటి వద్దే లభిస్తాయి. ఈ కార్యక్రమంలో వెం కన్నపాలెం సర్పంచ్ కోకర్ల మధు యాదవ్, మండలం తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి డా.తిరుమల శెట్టి కోటేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పల్లె మల్లు వెంకటకృష్ణారెడ్డి, మండల సోషల్ మీడియా అధ్యక్షులు మీజురు మధుబాబు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తల్లం శ్రీనివాసులు, బూత్ ఇంచార్జ్ నాగేంద్ర, గుండల మధు యాదవ్, ఎంపిపి కార్యాలయం సిబ్బంది మరియు తదిరులు పాల్గొన్నారు.



# ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు ఏర్పాటు

## - రాజనేని ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీనివాసులు నాయుడు



**గూడూరు, (రాజధాని వార్తలు):** ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలి వేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు రాజనేని రామానాయుడు ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీనివాసులు నాయుడు పేర్కొన్నారు. చిల్లకూరు మండల కేంద్రంలోని వరగలి క్రాస్ రోడ్డు, పోలీస్ స్టేషన్, గూడూరు పట్టణంలోని పాత బస్టాండు వంటి ప్రధాన సెంటర్లు వద్ద రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆ ట్రస్ట్ వ్యవస్థాపక అధినేత రాజనేని శ్రీనివాసులు నాయుడు దాతృత్వంతో మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు చేసి వారి చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేద ప్రజల దాహార్తిని తీర్చేందుకు గత 8 సంవత్సరాలుగా రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి రాజనేని రామానాయుడు, ట్రస్ట్ సభ్యులు బాబు, భాస్కర్, రైటర్ కస్తూరి అయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# గుణభూషణమ్మకి అవసరమైన అప్రూవల్ ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్‌ని కోరుతాం

**శ్రీకాళహస్తి టౌన్, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తి పట్టణంలో పానగల్ – ఊరందూరు ఆర్చ్ సమీపంలో నివసిస్తున్న గుణభూషణమ్మ (80) ఇంటి సమస్యపై నియోజకవర్గం మాజీ జనసేన ఇంచార్జి వినుత కోటా స్వయంగా వెళ్లి పరిశీలించి బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 70 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న వారి ఇల్లు దెబ్బతినడంతో మరమ్మతులు చేసుకుని రేకుల షెడ్ ఏర్పాటు చేసుకోవడానికి మునిసిపల్ కమిషనర్‌ని పలుమార్లు సంప్రదించి అనుమతి కోసం దరఖాస్తు చేసినప్పటికీ, ఇప్పటివరకు ఎటువంటి అప్రూవల్ ఇవ్వలేదన్నారు. అదేవిధంగా కార్యాలయంలో అవమానకరంగా ప్రవర్తిస్తూ బయటకు పంపించారని గుణభూషణమ్మ తమ ఎదుట వాపోయారన్నారు. అంతేకాకుండా, ఇల్లు కూల్చివేస్తామని బెదిరింపులు కూడా చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై స్పందించిన తాము చట్టపరమైన అనుమతులు లేకుండా ఎవరూ బలవంతంగా ఇల్లు కూల్చే అధికారం లేదని స్పష్టం చేశారు. మునిసిపల్ సిబ్బంది అప్రూవల్ ఇవ్వవద్దు అనే ఆదేశాలు ఉన్నాయని చెప్పడం అనుమానాస్పదమని ఆమె పేర్కొన్నారు. గుణభూషణమ్మ మనవడు కావలి శివకుమార్ జనసేన పార్టీకి చెందినవాడని, రాజకీయ కార ణాలతో కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. వారి తరాల ఆస్తికి సంబంధించిన అన్ని పత్రాలు సమర్పించినప్పటికీ అనుమతి ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం దుర్మార్గమని ఆమె



ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాళహస్తి మునిసిపల్ కమిషనర్‌పై ఇలాంటి ప్రజా ఇబ్బందులు, అవినీతి ఆరోపణలు తరచూ వస్తున్నాయని పేర్కొంటూ, మునిసిపల్ కమి షనర్ ప్రజల నుండి విచ్చలవిడిగా లంచాలు వసూలు చేస్తున్నాడని పదే పదే ప్రజలను ఇబ్బంది పెడుతున్నాడని తమ దృష్టికి ఇదివరకే పలు వినతులు వచ్చాయన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకునేలా చూస్తామని తెలిపారు. రాజకీయ ఒత్తిళ్లతో జనసేన మద్దతుదారులను ఇబ్బంది పెడితే ఊరుకోబోమని హెచ్చరించారు. తక్షణమే గుణభూషణమ్మకి అవసరమైన అప్రూవల్ ఇవ్వకపోతే, మునిసిపల్ కమిషనర్ కార్యాలయానికి వెళ్లి ఈ అంశంపై ప్రశ్నించాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

# కాపు - బలిజ సోదరులు వాస్తవాలను గుర్తించాలి



**విజయవాడ, (రాజధాని వార్తలు):** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న కాపు, బలిజ, తెలగ, తూర్పు కాపు సామాజిక వర్గాలకు చెందిన సోదర, సోదరీమణులు గత 6 దశాబ్దాల కాలం నుంచి జరిగిన రాజకీయ అణచివేత వ్యవహారాలను నిశితంగా పరిశీలించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర కాపు సంఘం నాయకులు వేల్పూరు శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గతంలో వైయస్సార్, చంద్రబాబు నాయుడులకు, కాపు – బలిజలతో సంబంధాలు ఎలా ఉన్నాయి. వైయస్ రాజశేఖర్ రెడ్డి కడప జిల్లా కాంగ్రెసు పార్టీ నాయకుడు కావడంతో అంతకు ముందు పనిచేసిన రెడ్డి సిఎంలు అందరూ వైయస్సార్‌కు పూర్తి వ్యతిరేకంగా ఉన్నారు. అలాంటి పరిస్థితుల్లో కాపు నేత వంగవీటి మోహన రంగా మద్దతు ఇవ్వడం ద్వారా కోస్తా జిల్లాల్లో నాయకుడుగా ఎదిగి, రంగా మరణానంతరం ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి సిఎం అయ్యారు. రంగా హత్యవల్లే 1989లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రంగా పేరు కృష్ణా జిల్లాకి పెట్టకుండా వైకాపా నుంచి బయటకు ఉమ్మడి కూటమి ప్రభుత్వం వరకు కుట్రలు చేస్తున్నారు. కడప జిల్లాకు జగన్ తన తండ్రి పేరు పెట్టుకున్న జగన్ మోహన్ రెడ్డికి, కృష్ణా జిల్లాకి రంగా పేరు పెట్టాలని గుర్తుకు రాకపోవడం కాపుల అణచివేతకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. గతంలో హైకోర్టు 9 కులాలను బిసి జాబితాలో చేర్చాలని ఆదేశించినా అన్ని వర్గాలను బిసిలో చేర్చి ఒక్క కాపు సామాజిక వర్గంను బిసి జాబితాలో చేర్చకుండా అప్పట్లో వైయస్ రాజశేఖర్ రెడ్డి నేరుగా అడ్డుకోవడం జరిగిందన్నారు. అదేవిధంగా చంద్రబాబు నాయుడు 1975 ప్రాంతంలో ఎస్.వి యూనివర్సిటీ నందు హాస్టల్ ఎన్నికల్లో కడప జిల్లాకి చెందిన సుధాకర్ రెడ్డి మీద పోటీ చేస్తే ఆనాటి రోజుల్లోనే చిత్తూరు,కడప జిల్లాలకు చెందిన బలిజలు అంతా ఏకమై చంద్రబాబుకి ఓటు వేసి గెలిపించారు. విద్యార్థి సంఘాల ఎన్నికల్లోనే చంద్రబాబుకి మొదటిసారిగా రాజకీయ మద్దతు తెలిపిన బలిజలు ఆయన గెలుపులో ప్రధాన పాత్ర పోషించారు. ఆ తర్వాత అనేక ఎన్నికల్లో కాపులు, బలిజలు చంద్రన్న వెంటనే నడిచారు. ప్రధానంగా 2014లో పవన్ కళ్యాణ్ పిలుపుతో మరోసారి కాపులు, బలిజలు చంద్రబాబుకు అండగా నిలబడడం జరిగింది. 2019 ఎన్నికల సమయంలో కాపు–బలిజలు చంద్రబాబుతో విభేదించగా, చంద్రన్న చిత్తు చిత్తుగా ఓడిపోయారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చంద్రన్న రాజమండ్రి జైలులో ఉన్నప్పుడు చంద్రబాబుకి పవన్ కల్యాణ్ మద్దతు ఇచ్చి పునర్జన్మ ఇచ్చారు. లేకపోతే జగన్ ప్రభుత్వం జైల్లో చంద్రబాబుని అంతం చేయడానికి అప్పట్లో రంగం సిద్ధం చేసినట్లు రాష్ట్రమంతా కోడై కూసింది. ఇలాంటివి అనేక సందర్భాలు ఉన్నప్పటికీ వైయస్సార్, చంద్రబాబు ఇద్దరూ కూడా కాపులకు వ్యతిరేకంగా ఉన్నారు. ఇందుకు గల ప్రధాన కారణం కాపు – బలిజల అమాయకత్వంతోపాటు రాజకీయ చైతన్యం లేకపోవడం. కేవలం 4.6 శాతం ఉన్న కమ్మ కులస్తులు, 6.2 శాతం ఉన్న రెడ్డి కులస్తులు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి సిఎంలుగా 75 సంవత్సరాలు ఉన్నారు. ఆ రెండు సామాజిక వర్గాల నేతలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్థికంగా బలపడిన ట్లు భారతదేశంలో ఏ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు కూడా బలపడలేదు. కాపులు, బిసిలు అత్యధిక శాతం ఉన్నా ఏ ఒక్కరు కూడా సిఎం కాలేదు. దళిత శిఖరం దామోదరం సంజీవయ్య 1961లో సిఎంగా ఉన్న ప్పుడు ఎన్నో కుట్రలు చేసి సంజీవయ్యను కేవలం 15 నెలలకే అధికారం నుంచి దించి వేశారు. 2006 లో కుప్పం నుంచి పులివెందుల వరకూ, తడ నుండి ఇచ్ఛాపురం వరకు రాష్ట్ర యువ కాపునాడు ప్రెసిడెంట్‌గా 1520 కి.మీలు 70 రోజుల పాటు కాపు సమస్యలు పరిష్కారం కోసం కాపు– బలిజ మహా పాద యాత్ర, నెల్లూరు జిల్లా కావలిలో 7 రోజులు ఆమరణ నిరాహార దీక్ష, శిరోముండనం, అనేక రకాల పోరాటాలు తాను చేయడం జరిగిందనీ శ్రీనివాస రావు పేర్కొన్నారు. అయితే గొర్రె కసాయిని నమ్మినట్లుగా కాపులు కూడా కమ్మ, రెడ్డి సామాజిక వర్గాలకు చెందిన నేతలను నమ్మి మోస పోయారనీ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఏ పార్టీ నాయకులు అయినా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాపులు – బలిజల మద్దతు వల్లే సిఎం అవుతారు. ఆ తరువాత కాపులను అన్ని రకాలుగా అణచి వేస్తారు.75 ఏళ్లుగా ఇదే తంతు జరుగుతోంది. కాపులను మొదటిసారిగా బీసీ నుండి అకారణంగా తొలగించి మోసం చేసింది 1956లో అప్పటి సిఎం నీలం సంజీవరెడ్డి. 70 సంవత్సరాల నుండి కాపులును వర్గ శత్రువులుగా భావిస్తున్నారు. వంగవీటి మోహన రంగా, కన్నా లక్ష్మీనారాయణలు సిఎం కాకుండా అనేక రకాలుగా కుట్రలు చేశారు. ఇప్పటికైనా కాపు – బలిజలు అర్థం చేసుకోవాలని తద్వారా కమ్యూనిటీకి న్యాయం చేసుకోవాలని వేల్పూరి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

# ఎయిడ్స్ వ్యాధిని అవగాహనతోనే అరికట్టడానికి సాధ్యం : డాక్టర్ ప్రమీలమ్మ



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** ఎయిడ్స్ వ్యాధిని అవగాహనతోనే అరికట్టడానికి సాధ్యమని డాక్టర్ ప్రమీలమ్మ అన్నారు. శనివారం శ్రీకాళహస్తిలోని స్టెప్స్ స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో ఎయిడ్స్ నిర్మూలనపై ఆ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ ప్రమీలమ్మ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిని అవగాహనతోనే అరికట్టడానికి సాధ్యమవుతుందని చెప్పారు. హెచ్ ఐవి సోకిన గర్భవతి నుంచి బిడ్డకు రాకుండా మందులు ఉపయోగించి రక్షించవచ్చు అన్నారు. ఏఆర్‌టి మందులు ఎలా వాడలో తెలిపారు. అలానే 30 మంది వ్యాధి గ్రహస్తులకు, గర్భిణీ స్త్రీలు పిల్లలకు న్యూట్రిషన్ పౌడర్, విటమిన్ మందులు మినరల్స్ ఫుడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ భాస్కర్, డి ఎస్ ఆర్ సి కౌన్సిలర్ ఉష, ఏ ఆర్ టి కౌన్సిలర్ రాధిక, స్టెప్స్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు త్యాగానికి చిహ్నమే రాష్ట్ర రాజధాని అమరావతి

**శ్రీకాళహస్తి టౌన్, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి తెలంగాణా విడివడి ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తరువాత ఏపీకి రాజధానిగా ఎంపిక చేసిన అమరావతి నిర్మాణం కొరకు భూములు ఇచ్చిన రైతుల త్యాగానికి చిహ్నమే అమరావతి అని తంగేళ్ళ పాలెం పిఏసియస్ ఛైర్మన్ బీమాల భాస్కర్, తెలుగుదేశం పార్టీ, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్ రావులు కొనియాడారు. రాష్ట్ర విభజన జరిగిన నాటి నుంచి రాజధాని విషయంలో కొనసాగుతున్న అస్పష్టతను శాశ్వతంగా తొలగిస్తూ ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి శాశ్వత చట్టబద్ధత కల్పిస్తూ అసెంబ్లీలో చారిత్రాత్మక తీర్మానం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జగన్ రెడ్డిలాంటి తుగ్లక్ పాలకులు వచ్చి రాజధాని విషయంలో ఎన్ని పిచ్చి ప్రయత్నాలు చేసినా ఏపీ రాజధానిగా అమరావతి మాత్రమే ఉంటుందని, అందుకు అవసరమైన చట్టబద్ధత కల్పిస్తూ అమరావతిని ఏపీ శాశ్వత రాజధానిగా నిలబెట్టే దిశగా చారిత్రాత్మక అడుగు పడినందుకు తమ భూములను త్యాగం చేసిన రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని, ఇకపై మీ రాజధాని ఏది అని అడిగితే మా రాజధాని అమరావతి అని ప్రతీ ఆంధ్రుడు సగర్వంగా చెప్పుకోవచ్చని హర్షం వ్యక్తం చేశారు. జగన్ రెడ్డి కక్ష పూరిత రాజకీయాలకు బలైన ప్రజా రాజధాని – మన అమరావతికి పునరుజ్జీవన ప్రక్రియ తేవడానికి ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తూనే 58 వేల కోట్ల రూపాయలతో పనులు ప్రారంభించి అమరావతికి మళ్లీ



వెలుగులు తీసుకొచ్చారన్నారు. అమరావతి కేవలం ఒక నగరం కాదని, అది ఆంధ్రుల ఆత్మగౌరవ చిహ్నం అని, అమరావతికి లభించిన ఈ గౌరవం యావత్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే గర్వకారణం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ జి.దశరథాచారి, వన్నెకుల క్షత్రియ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, గిరిజన సలహా మండలి సభ్యులు యం.సుబ్బయ్య, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు, తంగేళ్ళ పాలెం పిఏసియస్ ఛైర్మన్ బీమాల భాస్కర్ ముదిరాజ్, శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, తిరుపతి పార్లమెంటు నాయకుడు గంగనపల్లి రమేష్, సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు కామన్ ఎంట్రన్స్ టెస్ట్

## - ఆదిశంకర డీమ్డ్ యూనివర్సిటీ చాన్సలర్ వంకి అరవింద




**గూడూరు, (రాజధాని వార్తలు):** ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి వారికి ఉన్నత విద్యను అందించడమే కాకుండా వారికి ఆర్థిక సహాయం అందించేందుకు ఆదిశంకర యూనివర్సిటీ, కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహిస్తుందని యూనివర్సిటీ చాన్సలర్ వంకీ అరవిందా వెల్లడించారు. శనివారం గూడూరు పట్టణ సమీపంలోని ఆదిశంకర డీమ్డ్ యూనివర్సిటీలో జరిగిన విలేకరుల సమావేశంలో చాన్సలర్ వంకీ అరవింద మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఏప్రిల్ రెండో వారంలో ఆదిశంకర కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహిస్తుందని తెలిపారు. దీనిలో ఒకటి నుండి 10వ ర్యాంకు వరకు సాధించిన విద్యార్థులకు వారు ఎంచుకున్న కోర్స్‌లో 100% ట్యూషన్ ఫీజు మాఫీ చేయడం జరుగుతుందని 11 నుంచి 20వ ర్యాంకు సాధించిన వారికి 50 శాతం 21 నుండి 30 ర్యాంకు సాధించిన వారికి 25 శాతం 51వ ర్యాంక్ నుండి 100 లోపు సాధించిన వారికి పది శాతం ఫీజు రాయితీ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు యూనివర్సిటీలో కానీ లేదా ఆన్లైన్‌లో ఉన్న వెబ్ సైట్‌లో తెలుసుకో వచ్చని విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకో వాలని కోరారు. ఈ సమావేశంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మోహన్, రిజిస్ట్రార్ రాజయ్య, డిప్యూటీ రిజిస్ట్రార్ (అడ్మిషన్స్) రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడికి అరుదైన గుర్తింపు

**న్యూఢిల్లీ:** కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు మరో అరుదైన ఘనత సాధించారు. దేశంలో పవర్‌ఫుల్ ఇండియన్స్ (శక్తిమంతమైన భారతీయులు) జాబితాలో ఆయన చోటు సంపాదించారు. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రకటించిన వంద మంది శక్తివంతమైన భారతీయుల జాబితాలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు 90వ స్థానాన్ని పొందారు. మోదీ ప్రస్తుత కేబినెట్‌లో అత్యంత పిన్న వయస్కుడు అయిన కేంద్ర మంత్రిగా రామ్మోహన్ నాయుడు గుర్తింపు పొందారు. గతేడాది 2025 అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం.. అలాగే ఇండిగో విమానయాన సంక్షోభాలను పౌర విమానయాన శాఖ మంత్రిగా ఆయన సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. అదేవిధంగా దేశీయ ఏరోస్పేస్ తయారీ రంగాన్ని ప్రోత్సహించడమే కాకుండా, విమాన ప్రయాణాన్ని సామాన్యులకు అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా ఆయన కృషి చేస్తున్నారు. లోక్‌సభ సభ్యుడిగానే కాకుండా కేంద్ర మంత్రిగా పార్లమెంటులో




బలమైన ప్రాంతీయ గళాన్ని ఆయన తనదైన శైలిలో వినిపిస్తున్నారు. అలాగే పలు సామాజిక అంశాలపై నిరంతరంగా ఆయన పోరాటం చేస్తున్నారు. రాజకీయాల్లోకి రాక ముందు రామ్మోహన్ నాయుడు మంచి ఫోటోగ్రాఫర్ కూడా. నరేంద్ర మోదీ క్యాబినెట్‌లో 38 ఏళ్ల అత్యంత పిన్న వయస్కుడైన కేంద్ర మంత్రుల్లో ఒకరిగా రామ్మోహన్ నాయుడు గుర్తింపు పొందారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
# 9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఏ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మండడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పాస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞాననందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996


## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్స్టానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# ముఖ్యమంత్రి దృష్టికి స్మాల్ పత్రికల సమస్యలు




LOCAL NEWSPAPERS ASSOCIATION
Visakhapatnam


**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో స్మాల్ పత్రికలు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు దృష్టికి లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ (ఎల్ఎన్ఏ) ప్రతినిధి బృందం తీసుకొని వెళ్ళింది. విజయవాడలో జరుగుతున్న ఇండియన్ జర్నలిస్ట్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) ప్లీనరీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయనకు శనివారం డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. నాన్ ఎంప్యానల్డ్ స్మాల్ దినపత్రికలకు స్టేట్ హెడ్ క్వార్టర్‌లో అక్రిడేషన్ సదుపాయం, ప్రచురణ కేంద్రంలో అక్రిడేషన్లు పెంచాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. స్థానిక పత్రికల్లో వార్తలు రాస్తున్న ఫ్రీలాన్స్ జర్నలిస్టులకు, ఎంప్యానల్ మెంట్ కలిగి 10 వేలు సర్కులేషన్ ఉన్న పత్రికలకు, ఉమ్మడి జిల్లా ప్రచురణ కేంద్రం, ఇతర జిల్లాల నియోజక వర్గాల వారి గానూ, 10 వేలకు పైగా సర్కులేషన్ కలిగిన దిన పత్రికలకు ప్రచురణ కేంద్రం కాని ఇతర జిల్లాల్లో అక్రిడేషన్లు జారీ, 2018వ సంవత్సరం నుండి పెండింగ్‌లో ఉన్న స్మాల్ పత్రికల బిల్లులు చెల్లించాలని కోరారు. స్థానిక దిన, వార, పక్ష, మాసపత్రికలకు సమాచార శాఖ యాడ్స్ రూపంలో సహకారం అందించాలని పేర్కొన్నారు.


గత ఆరు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న నూతన ఎంప్యనల్మెంట్ ఫైళ్లు పరిష్కరించాలని, కొత్తగా దరఖాస్తు చేసుకునే సదుపాయం కల్పించాలని ఎంప్యానల్డ్ స్మాల్ పత్రికల రేటుకార్డు ప్రకారం యాడ్స్ విడదల చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎన్ ఏ అధ్యక్షుడు పి.సత్య నారాయణ, ప్రతినిధులు కె.రాము, కె.పరశురాం, కె.వాసు దేవరావు, లీలా ప్రసాద్, శివ, తదితరులు పాల్గొన్నారు.

# చంద్ర శేఖర స్వామి కళ్యాణ పూజలకు అంకురార్పణ

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ విశ్వేశ్వర చంద్రశేఖర స్వామి ఆలయంలో స్వామివారి వార్షిక కళ్యాణ మహోత్సవాలు శుక్రవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 27వ తేదీ నుంచి ఏప్రిల్ రెండవ తేదీ వరకు జరిగే స్వామివారి దివ్య కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా అంకురార్పణ పూజలను ఆలయ కార్యనిర్వహణ అధికారి కే జగదీశ్వరరావు, ఆలయ చైర్మన్ జట్లా యుగంధర్ సర్వేశ్వరరావుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విగ్రహాలను ప్రత్యేక వేదికపై ఉంచి విఘ్నేశ్వర పూజ, అంకురార్పణతో ఈ మహోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారి జగదీశ్వర రావు మాట్లాడుతూ స్వామివారి దివ్య కల్యాణ పూజలకు ఆలయం వద్ద భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఈ పూజలో ఆలయ ధర్మకర్తలు, పండితులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# పచ్మర్హి : మధ్యప్రదేశ్‌లో వేసవికి ఉత్తమమైన హిల్ స్టేషన్





**(రాజధాని వార్తలు):** సముద్ర మట్టానికి 1,607 మీటర్ల ఎత్తులో ఉన్న పచ్మర్హి, దాని పొరుగు నగరాల కంటే గణనీయంగా చల్లగా ఉంటుంది. ఒత్తిడితో కూడిన నగర జీవితాల నుండి తప్పించుకోవాలనుకునే వారికి ఇది ఒక సరైన విహార ప్రదేశం.

సహజమైన ఎయిర్ కండిషనింగ్: ఇది సత్పురా పర్వత శ్రేణిలో ఎత్తైన ప్రదేశంలో ఉన్నందున, మైదాన ప్రాంతాలు మండు తున్నా ఇక్కడి వేసవి వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది.

చల్లని సూర్యాస్తమయం: ఈ పర్వత శ్రేణిలో అత్యంత ఎత్తైన ప్రదేశమైన ధూప్‌గఢ్ (1,350 మీ), వేసవి తేమ లేకుండా సూర్యాస్తమయాన్ని వీక్షించడానికి అనువైన చల్లని ప్రదేశాన్ని అందిస్తుంది.

చల్లని జలపాతాలు: ఆవిరితో నిండిన అప్సర విహార్ ("ఫెయిరీ పూల్")ను సందర్శించడానికి లేదా 150 అడుగుల బీ ఫాల్స్ కింద నిలబడటానికి వేసవి కాలం ఉత్తమ సమయం. ఇక్కడి నీరు ఏడాది పొడవునా ఉధృతంగా ప్రవహిస్తుంది, మరియు ఆ తుంపరలు అడవి యొక్క సొంత శీతలీకరణ వ్యవస్థలా అనిపిస్తాయి.

నీడలో విశ్రాంతి స్థలాలు: పాండవ గుహలు మరియు రాతితో ఏర్పడిన జటా శంకర్ గుహ సహజమైన నీడను, చల్లని, తేమతో కూడిన వాతావరణాన్ని అందిస్తాయి. మధ్యాహ్న పూట అన్వేషణకు ఇది చాలా అనువైనది.

ఎక్కడ బస చేయాలి: పచ్మర్హిలో మీ చల్లని విడిది స్థలాలు

ఎంపిటి గ్లెన్ వ్యూ: మీరు వలసవాద కాలపు వైభవాన్ని, విశాలమైన స్థలాన్ని కోరుకుంటే, ఇది మీ వేసవి విడిది. ఇక్కడి భారీ గదులు, పురాతన శైలి బాల్కనీలు పచ్చని ప్రకృతి దృశ్యాలను కళ్ళకు కనువిందు చేస్తాయి. పిల్లల కోసం ప్రత్యేక ఆట స్థలం, సాయంత్రాలలో ఆహ్లాదకరమైన గాలి వీచేందుకు విశాలమైన తోటలతో, ఇది శాశ్వతమైన ఆకర్షణను, వేడి నుండి పరిపూర్ణమైన ఉపశమనాన్ని అందిస్తుంది.

ఎంపిటి చంపక్ బంగ్లా: వేసవి కాలం, స్విమ్మింగ్ పూల్స్ ఒకదానికొకటి సరిగ్గా సరిపోతాయి. పట్టణంలో ఈ అనుభూతిని అందించే కొన్ని ప్రదేశాలలో చంపక్ బంగ్లా ఒకటి. ఇది సరస్సు పక్కనే ఉంటుంది, కాబట్టి మీరు ప్రశాంతమైన జలతీరపు చల్లదనాన్ని పొందుతారు. ఉదయం పూట అన్వేషించిన తర్వాత, మధ్యాహ్నం నీటి పక్కన సేద తీరాలనుకుంటే ఇది చాలా సొగసైనది, క్లాసిక్‌గా ఉంటుంది.

ఎంపిటి నీలాంబర్ స్కైలైన్: "ప్రపంచం నుండి దూరంగా ఏకాంతంగా ఉన్న" అనుభూతి కోసం, ఇక్కడికి వెళ్ళండి. వారు ఇటీవల లోయకు అభిముఖంగా ఉండే ఒక ఈత కొలనును జోడించారు – పచ్చని, పచ్చికతో నిండిన సత్పురా పర్వత శ్రేణిని చూస్తూ అందులో స్నానం చేస్తున్నట్లు ఊహించుకోండి.

ఇది ప్రశాంతంగా ఉంటుంది, ఇక్కడి ఆహారం ఇంటి భోజనంలా అనిపిస్తుంది, మరియు ఇక్కడి దృశ్యాలు మైదాన ప్రాంతాలలోని ఇతర చోట్ల ఉండే 40 డిగ్రీల సెల్సియస్ వేడిని మరిచిపోయేలా చేస్తాయి.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan